


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శనివారం 14-01-2023 సంపుటి : 04 సంచిక : 127 పేజీలు : 4 వెల : రూ 3-00


## జనవరి 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు.. ఎప్పటి వరకంటే!



న్యూఢిల్లీ: బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి ప్రారంభం కానున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.రెండు విడతల్లో జరగనున్న పార్లమెంట్ సమావేశాలు ఏప్రిల్ 6న ముగియనున్నాయని తెలిపారు. తొలి విడత జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 14వ తేదీ నుంచి మార్చి 12వ తేదీ వరకు తాత్కాలిక విరామం ఉంటుందన్నారు.రెండో విడతలో మార్చి 13న ప్రారంభమై ఏప్రిల్ 6తో ముగియనున్నట్లు పేర్కొన్నారు. 66 రోజుల వ్యవధిలో మొత్తం 27 రోజల పని దినాల్లో ఈ సమావేశాలు కొనసాగున్నట్లు తెలిపారు. ఈ అమృత కాలంలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ, కేంద్ర బడ్జెట్, ఇతర అంశాలపై చర్చలు జరుగుతాయని పేర్కొంటూ కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి శుక్రవారం ట్వీట్ చేశారు. కాగా ఈ సమావేశాల్లో తొలిసారి పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం చేయనున్నారు.

## తెలుగు రాజకీయాల్లో పవన్ కల్యాణ్ కామెడీ పీస్: అంబటి రాంబాబు



సత్తెనపల్లి: తెలుగు రాజకీయాల్లో పవన్ కామెడీ పీస్ అని ప్రజలకు అర్థమైందని మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. నా అంత సంస్కారవంతమైన నాయకుడు లేడని అంటాడు, మంత్రులను దూషిస్తాడు.పవన్‌ది అసలు నోరేనా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ గురించి మాట్లాడే అర్హత పవన్‌కు ఉందా అని ప్రశ్నించారు. జగన్ లాంటి ఏనుగు వెళ్తుంటే పవన్ లాంటి కుక్కలు మొరుగుతుంటాయి అని మండిపడ్డారు.'సింగిల్‌గా వెళితే వీరమరణం అని నీకు అర్థమైంది. పిరికి సన్నాసుల్లారా మీకు దమ్ము, ధైర్యం లేదు. మీరు కలిసొచ్చినా రాజకీయంగా మరణమే. మీకు ఆరాటం తప్ప పోరాటమే లేదు. పవన్ దృష్టిలో గౌరవం అంటే ప్యాకేజీయే. తగిన ప్యాకేజీ అందితే పొత్తుకు సిద్ధమని పవన్ మరోసారి చెప్పాడు. చంద్రబాబు కోసం పెట్టిందే జనసేన పార్టీ. పవన్‌లాంటి చీడ పురుగులకు ప్రజలు ఓట్లు వేయరు. చంద్రబాబుతో పవన్ ఏం మాట్లాడాడో మాకు తెలుసు. పవన్ వెళ్తున్న మార్గం మంచిది కాదని యువత గుర్తించాలి' అని మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

## ఉత్తరాంధ్ర వాసుల అవసరాలు తీర్చేలా.. 'వందే భారత్' పరుగులకు సర్వం సిద్ధం

హైదరాబాద్, గిర్మాజీపేట, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎదురు చూస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పరుగులకు సర్వం సిద్ధమైంది.సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు 10వ ప్లాట్‌ఫాం నుంచి ఈ రైలు పరుగందుకోనుంది. రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం చేరుతుందని అంచనా. తొలుత వరంగల్, విజయవాడ, రాజమండ్రిలో మాత్రమే ఆగుతుందని అనుకున్నా ఖమ్మంలోనూ ఆపాలని యోచిస్తున్నట్లు సమాచారం.హైదరాబాద్ నుంచి ఉత్తరాంధ్రకు జిల్లాలకు వెళ్లాలంటే.. రైళ్లలో ఎప్పుడూ బెర్తులు దొరకని పరిస్థితి ఉంటుంది. 4 నెలల ముందు బెర్తుల రిజర్వేషన్ ప్రారంభమైనా కొద్ది రోజులకే రైళ్లు నిండిపోతుంటాయి. రోజూ ప్రయాణించే 9 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తోడు.. వారంలో 1, 2, 3 రోజులు నడిచే ప్రత్యేక రైళ్లున్నా, అన్నింటిలోనూ నిరీక్షణ జాబితా చాంతాడంత కన్పిస్తుంటుంది. ఈ తరుణంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రావడాన్ని నగర ప్రయాణికులు స్వాగతిస్తున్నారు.ప్రారంభ రోజు మినహా..మిగతా రోజుల్లో విశాఖపట్నం నుంచి ఉదయం 5.45 గంటలకు వందేభారత్ రైలు బయలుదేరి మధ్యాహ్నం 2.25 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మధ్యాహ్నం 2.45 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి రాత్రి 11.25 గంటల సమయంలో విశాఖపట్నం చేరుతుందని ప్రాథమికంగా అందిన సమాచారం. వారంలో 6 రోజులే నడుస్తుంది. ఆదివారం నడవదని షెడ్యూలులో వెల్లడించారని వరంగల్ రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ స్వామి తెలిపారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద రివర్ క్రూయిజ్‌ను ప్రారంభించిన మోదీ..

ఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద రివర్ క్రూయిజ్ గంగా విలాస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ క్రూయిజ్ వారణాసి నుంచి 3,200 కిలోమీటర్లు ప్రయాణించనుంది.అస్సాంలోని దిబ్రూగర్ వద్ద తొలి పర్యటన ముగియనుంది. తొలి బ్యాచ్ లో 52 మంది స్విస్ టూరిస్టులు పాల్గొంటున్నారు. మొత్తం 51 రోజుల ప్రయాణానికి రూ.20 లక్షలు ఖర్చు అవుతుంది. ఒక ప్రయాణికుడికి



ఒక రోజుకు రూ. 25,000- 50,000 ఖర్చు అవుతుంది.ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు మోదీ. ఇందులో భాగంగానే వారణాసిలో టెంట్ సిటీకి మోదీ శ్రీకారం చుట్టారు. గంగ ఘాట్ వద్ద 200 టెంట్ల ఏర్పాటుతో పాటు రూ.1000 కోట్ల ఖర్చుతో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్‌ను ప్రారంభించారు. క్రూయిజ్ ప్రత్యేకతలు.. వారణాసి నుంచి బయల్దేరే గంగా విలాస్ మొత్తం 3,200 కి.మీ. ప్రయాణించి బంగ్లాదేశ్ మీదుగా అసోంలో దిబ్రుగఢ్‌కు చేరుకుంటుంది. ఈ మొత్తం ప్రయాణానికి 51 రోజులు సమయం పడుతుంది. 27 నదుల్ని దాటుకుంటూ ప్రయాణం సాగుతుంది. మూడు అంతస్తులు ఉండే గంగా విలాస్‌లో 18 సూట్స్ ఉన్నాయి.62 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు , సౌకర్యవంతంగా ప్రయాణించడానికి వీలుగా 1.4 మీటర్ల డ్రాఫ్ట్ ఉంది . ప్రయాణికుల కోసం అత్యంత విలాసవంతమైన ఏర్పాట్లు చేశారు. ప్రతీ రోజూ నౌకలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. జిమ్, స్పా వంటి సదుపాయాలతో పాటు వ్యక్తిగతంగా బట్లర్ సర్వీసు, నౌకపైకి వెళ్లి ప్రయాణాన్ని ఎంజాయ్ చేసే అవకాశం ఉంటుంది. ప్రపంచ వారసత్వ కట్టడాలు, ాతీయ ఉద్యానవనాలు, నదుల ఒడ్డున ఉండే పుణ్యక్షేత్రాలు, చారిత్రక ప్రాధాన్యం కలిగిన పట్టణాలు వంటి 50 పర్యాటక ప్రాంతాలను సందర్శించవచ్చు.బిహార్‌లో పట్నా, జార్ఖండ్‌లో సాహిబ్‌గంజ్, పశ్చిమ బెంగాల్‌లో కోలకతా, బంగ్లాదేశ్‌లో ఢాకా, అసోంలో గౌహతి పట్టణాలను గంగా విలాస్ కవర్ చేస్తుంది. బీహార్ స్కూల్ ఆఫ్ యోగ, విక్రమశిల యూనివర్సిటీలను విజ్ఞానం పంచే ప్రాంతాలు, సుందర్‌బన్స్, బెంగాల్ డెల్టా ప్రాంతాలు, కజిరంగ నేషనల్ పార్క్ వంటి జాతీయ ఉద్యానవనాలను సందర్శించవచ్చు.? మొదటి రోజు వారణాసిలో గంగా హారతిని సందర్శించిన అనంతరం ఈ నౌక బయల్దేరుతుంది. ఎనిమిదో రోజు పట్నాకి, 20వ రోజు కోల్‌కతాకి 35వ రోజున బంగ్లాదేశ్‌లో ఢాకాకి చేరుకుంటుంది. ఇక 50వ రోజు అంటే మార్చి 1న తిరిగి అసోంలోని దిబ్రుగఢ్‌కి చేరుకుంటుంది.

# జన్మభూమి స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి అంతా కలిసి రావాలి

**తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పిలుపు**

**తెలుగు ప్రజలకు భోగి-సంక్రాంతి శుభాకాంక్షలు..**



అమరావతి జనవరి 13 తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజలకు భోగి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదల ఇళ్లల్లో వేడుకలు చూడాలనే నాడు సంక్రాంతి కానుకలు ఇచ్చామన్నారు. జన్మభూమి స్ఫూర్తితో గ్రామాల అభివృద్ధికి అంతా కలిసి రావాలని పిలుపిచ్చారు. క్రాంతి అంటే అభ్యుదయమని, సంపదలు, సంస్కృతి వరంగా పురోగతిని ఆశిస్తూ వచ్చే పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు.భోగి-సంక్రాంతి-కనుమ.. మూడురోజుల పండుగ సంక్రాంతి అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పల్లెల్లో సందళ్లు, సరదాలు, జ్ఞాపకాలు పంచే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని, తెలుగువారందరూ పల్లె సీమలకు తరలే ఆత్మీయ పండుగని అన్నారు. ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు.. పండుగను సంతోషంగా జరుపుకోవాలని నాడు ఆలోచించామన్నారు. టీడీపీ హయాంలో తొలిసారిగా పేదలకు పండుగ కానుకలు ఇచ్చే సాంప్రదాయానికి నాంది పలికామన్నారు. ఒక్క సంక్రాంతికే కాకుండా.. రంజాన్, క్రిస్మస్?లకు పండుగ కానుకలిచ్చామన్నారు. ఏడాదికి రూ.350 కోట్లు ఖర్చు చేసి పేదింట పండుగ సంతోషాన్ని నింపామన్నారు.

# 'ఉత్తరాంధ్ర బాగుపడటం పవన్‌కు ఇష్టం లేదా?'



శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర బాగుపడటం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఇష్టం లేదనే విషయం నిన్నటి సభ ద్వారా మరోసారి అర్థమైందని మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు.అసలు పవన్ మాటలకు చేతలకు పొంతనే లేదని ధర్మాన విమర్శించారు. ఈరోజు (శుక్రవారం) మాట్లాడిన ధర్మాన.. ' ఉత్తరాంధ్ర బాగుపడటం పవన్‌కు ఇష్టం లేదా?, పవన్ మాటలకు చేతలకు పొంతన లేదు. ప్రజా నాయకులు హుందాగా ఉండాలి. పుస్తకాలు చదవడం కాదు.. అందులో ఉండే భావజాలాన్ని అర్థం చేసుకోవాలి. అమరావతిలో రాజధాని అనేది రియల్టర్ల కోసమే. విశాఖ రాజధానితో మా ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టినష్టపోయాం. అలాంటి తప్పు మళ్లీ జరగకూడదనే వికేంద్రీకరణ. వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం.కిడ్నీ బాధితుల కోసం పలాసలోనే ఆస్పత్రి ఏర్పాటు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి.






## పవన్.. డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేయగలరా?: మంత్రి అమర్‌నాథ్



అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు ప్యాకేజీకి అమ్ముడుపోయిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇష్టానుసారం అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని మంత్రి అమర్‌నాథ్ విమర్శించారు.ఆరు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన తమ కుటుంబంపై నోటికొచ్చినట్లు మాట్లాడారని ఆయన మండిపడ్డారు. యువశక్తి సభ ద్వారా యువతకు ఏం సందేశం ఇచ్చారని అమర్‌నాథ్ ప్రశ్నించారు."మా తాత నుంచి మా కుటుంబం రాజకీయాల్లో ఉంది. మా తండ్రి మంత్రిగా చేశారు, నేను మంత్రిగా కొనసాగుతున్నాను. నా పేరు మీకు తెలియదేమో.. ఉత్తరాంధ్ర ప్రజలకు తెలుసు. నీలాంటి వారి నోటి నుంచి నా పేరు రావడం కూడా ఇష్టం లేదు. జనసేనను చంద్రసేనగా మార్చేశానని పవనే చెప్పారు. పీఎస్‌పీకే అంటే పవన్ కల్యాణ్ ప్యాకేజ్ స్టార్. చంద్రబాబుతో రెండు గంటల పాటు దేశ రాజకీయాలపై మాట్లాడారంటే ఎవరూ నమ్మరు. సీట్లు, ప్యాకేజీ పంపకాల గురించే చర్చించారు. డబ్బులు తీసుకోలేదని ప్రమాణం చేసి చెప్పగలరా? లక్ష్మీనరసింహస్వామి, చిరంజీవిపై ప్రమాణం చేసి చెప్పాలి. రాజకీయాల్లో జగన్ హీరో, పవన్ కల్యాణ్ విలన్" అని అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు.

## కోడి కత్తి కేసు లోసీఎం జగన్ కోర్టుకు రావాల్సిందే

**ఎన్ఐఏ కోర్టు తీవ్ర వ్యాఖ్యలు**

విజయవాడ జనవరి 13 కోడి కత్తి శ్రీనివాస్ కేసు లో ఎన్ఐఏ కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో బాధితుడిగా ఉన్న సీఎం జగన్ కోర్టుకు రావాల్సిందేనని కోర్టు టేప్ రికార్డర్?గా ఉండదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ కేసులో బాధితుడిని నేటి వరకూ ఎందుకు విచారించలేదని నిందితుడి తరపు న్యాయవాది సలీమ్ ప్రశ్నించారు. సమాధానంగా స్టేట్‌మెంట్ రికార్డు చేశామని ఎన్ఐఏ న్యాయవాది చెప్పారు. రికార్డు చేస్తే చార్జ్‌షీట్?లో ఎందుకు లేదని న్యాయమూర్తి ప్రశ్నించారు. బాధితుడిని విచారించకుండా మిగతా సాక్షులను.. విచారించి ఉపయోగం ఏముందని కోర్టు వ్యాఖ్యానించింది. బాధితుడిగా ఉన్న సీఎం కోర్టుకు రావాల్సిందేనని జడ్జి స్పష్టం చేశారు.56 మందిని ఈ కేసులో విచారిస్తే 1 నుంచి 12 వరకూ ఉన్నవారి స్టేట్‌మెంట్లు.. చార్జ్?షీట్?లో ఎందుకు లేవని ఎన్ఐఏ న్యాయవాదిని కోర్టు ప్రశ్నించింది. ఈనెల 31వ తేదీ నుంచి విచారణకు న్యాయస్థానం షెడ్యూల్ ప్రకటించింది. కోర్టుకు బాధితుడు సహా మిగతా వారంతా తప్పనిసరిగా హాజరుకావాలని జడ్డి స్పష్టం చేశారు. కాగా కోడి కత్తి కేసులో శ్రీనివాస్‌కు ఎన్ఐఏ కోర్టు బెయిల్ నిరాకరించింది.

## పవన్ ఏమాత్రం సంస్కారం లేని వ్యక్తి: మంత్రి దాడిశెట్టి రాజా

తాడేపల్లి: ఎప్పుడో చచ్చిపోయిన చంద్రబాబు పార్టీని బతికించటానికి పవన్ కల్యాణ్ తెగ ఆరాటపడుతున్నాడని మంత్రి దాడిశెట్టి రాజా విమర్శించారు.బలమైన కాపు సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ కూడా పవన్ దూషణలకు దిగాడని మండిపడ్డారు. తమ నాయకుడు చంద్రబాబు చెప్పాడని ఇలాంటి వ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టారు. మంత్రి అంబటి రాంబాబు కాపులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించే నేత అని, అలాంటి వ్యక్తిని కూడా దూషించడం సరికాదన్నారు.కష్టంతో ఎదిగిన గుడివాడ అమర్నాథ్‌ను సైతం తిట్టాడరి, పవన్ ఏమాత్రం సంస్కారం లేని వ్యక్తి అని ఆగ్రహవం వ్యక్తం చేశారు. 'చంద్రబాబు, పవన్ ఒకటేనని మేము ముందు నుంచే చెప్తున్నాం. అందుకే దత్తపుత్రుడు అంటున్నాం. సీఎం జగన్‌ను ఎదుర్కోలేనని పవన్ నిన్న తేల్చి చెప్పాడు. పవన్ చేసే జోకర్ చేష్టలు, బ్రోకర్ చేష్టలన్నీ చూసి కాపులంతా అసహ్యించుకుంటున్నారు. తన సభలకు వచ్చే యువతను రెచ్చగొట్టి పెడదారి పట్టేలా చేస్తున్నారు. 'నిన్ను నమ్మి వస్తే.. పోలీసులపై తిరగపడమని అనటం ఏంటి?. వారు కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తు నాశనం చేసుకోవాలా?.నిన్ను చూసి సమాజం సిగ్గుతో తలదించుకుంటోంది. నీ దత్తతండ్రి ఇచ్చే స్క్రిప్టు చదివితే సరిపోతుందా?. సంవత్సరానికి 15 వేల కోట్ల పెట్టుబడులు ఈ మూడేళ్లలో గ్రౌండ్ అయ్యాయి. అలాంటివి నీ కళ్లకు కనపడవా?. రాష్ట్రంలో అలజడులు సృష్టించటానికి పవన్ ప్రయత్నాలు చేస్తున్నారు.

# సంపాదకీయం

శనివారం 14-01-2023

## సామాన్యులకు భారంగా రైలు ప్రయాణం

రైల్వేలో ఇప్పటికే 13 లక్షల పర్మినెంట్ పోస్టులు (ఖాళీలతో కలిపి), 6.50 లక్షల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వీటిని 7 లక్షలకు తగ్గించారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న రైల్వే వ్యవస్థను ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్నారు. అదే జరిగితే ఇప్పటివరకు టిక్కెట్‌పై ఇస్తున్న రాయితీ 45 శాతానికి పడిపోతుంది. అలాగే సరకు రవాణాపై వచ్చే ఆదాయం ప్రైవేటు, కార్పొరేట్ చేతిలోకి వెళతాయి. కొత్త ఉద్యోగాలు రాకపోవడంతో పాటు ఉన్న ఉద్యోగాలు పోతాయి. రైలును వారు ఆదాయం వచ్చే రూట్లలోనే నడుపుతారు కాబట్టి వెనుకబడిన ప్రాంతాలకు రైలు దూరం అవుతుంది. అలాగే రైలు చార్జీల భారం పెరుగుతుంది.రైల్వే వ్యవస్థను ఇలా ప్రైవేటీకరించడం వలన అర్జెంటీనాలో 35 వేల కిలోమీటర్లు ఉన్న రైలు మార్గాన్ని రద్దుచేసి కేవలం 8 వేల కిలోమీటర్లు మాత్రమే నడుపుతున్నారు. ఆ అర్జెంటీనా అనుభవంతోనే ఇక్కడి రైల్వేను ప్రవేటీకరించడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా చాప కింద నీరులా ప్రైవేటీకరణ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తుంది. అందులో భాగంగానే ఇప్పటికే రైల్వేలోని 53 వేల కోట్ల ఆస్తులను అమ్మేసింది. అలాగే వారణాసీలో డీఎల్‌డబ్ల్యూ అనే ప్రభుత్వ రంగ కంపెనీకి గతంలో 320 డీజిల్ ఇంజన్లు తయారు చేయాలనే లక్ష్యాన్నివ్వగా ఆ కంపెనీ 330 ఇంజన్లనే తయారు చేసింది. ఇప్పుడు అలాంటి సంస్థను కాదని అమెరికాలోని ఎలక్ట్రికల్ సంస్థతో 1000 డీజిల్ ఇంజన్లకు ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే చెన్నైలోని ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ రైల్వే కోచ్‌లను తయారుచేస్తోంది. దానిని కాదని ఫ్రెంచ్ ఆల్ స్టామ్ నుండి దిగుమతికి ఒప్పందం కుదుర్చుకుంది.రాయబరేలీలోని కోచ్ ఫ్యాక్టరీ 1000 కోచ్‌లను తయారు చేయగలదు. కానీ 150 మాత్రమే తయారు చేయమనడం ఆశ్చర్యం. ఇలా విదేశాల కంపెనీలకు రైల్వే ఇచ్చే ఆర్డర్లు అన్నీ మన కంపెనీలకే ఇస్తే రూ. 20 వేల కోట్లు మిగులుతాయని రైల్వే అధికారి చెప్పారు. మన దేశంలో ఇంజన్ ఖర్చు రూ. 1.8 కోట్లు కానీ అమెరికాతో తీసుకుంటే దానికి రూ. 8 కోట్లు చెల్లించాలి. కానీ ఆ తయారీదారులు ప్రయాణికులను ఆకర్షించే పనిపై దృష్టి పెట్టి ప్రయాణికుల భద్రత గాలికొదిలేస్తారు. బ్రిటన్‌లో అదే జరిగింది. అక్కడి రైల్వే ప్రైవేటీకరణ తరువాత రైల్వే ప్రమాదాలు మూడు రెట్లు పెరిగాయి. తెలుగు రాష్ట్రాల మధ్య వందేభారత్ పరుగులు తీయనుంది. సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య నడవనున్న ఈ రైలును ప్రధాని నరేంద్రమోదీ జనవరి 19న ప్రారంభించనున్నారు. అయితే ఆ రోజు ప్రయాణికులకు రైలులో ప్రయాణించేందుకు అనుమతి లేదు. రైలును ఎప్పటి నుండి అందుబాటులోకి తీసుకొస్తారో.. అధికారులు ప్రకటించాల్సి ఉంది. సాధారణ రైలు కంటే.. వందే భారత్ రైలులో పలు ప్రత్యేకతలున్నాయి. పగటిపూట ప్రయాణం మొదలై.. సాయంత్రానికి పూర్తవుతుంది. వందేభారత్ రైలులో బెర్త్ లు ఉండవు. కేవలం చైర్ కార్ సీట్స్ మాత్రమే ఉంటాయి. కానీ.. దురంతో రైలు కంటే.. ఈ రైలు మరింత వేగంగా ప్రయాణిస్తుంది. ప్రస్తుతం.. విశాఖ–సికింద్రాబాద్ మధ్య నడిచే దురంతో రైలు 10.10 గంటల్లో గమ్యస్థానాన్ని చేరుకుంటుంది. వందేభారత్ మాత్రం 8 గంటల 40 నిమిషాల్లోనే గమ్యస్థానాన్ని చేరుకుంటుంది. అంటే గంటన్నర సమయం ఆదా అవుతుంది. ఇక మిగతా రైళ్లకైతే.. సికింద్రాబాద్ నుండి విశాఖకు చేరుకునేందుకు 12 గంటల 45 నిమిషాల సమయం వరకూ పడుతుంది. క్రాసింగ్ ఉంటే.. మరింత లేట్ కూడా అవుతుంది. ఛార్జీల విషయానికొస్తే.. ఇప్పటి వరకూ ఇంత ధర ఉంటుందని రైల్వే శాఖ ప్రకటించలేదు. కానీ.. వందేభారత్ రైల్లో ప్రయాణించాలంటే.. భారీగా ఖర్చు పెట్టాల్సిందేనని తెలుస్తోంది. సామాన్యుడి ఈ రైల్లో ప్రయాణించాలంటే కష్టమేనన్న వార్తలు వినవస్తున్నాయి. ఢిల్లీ–జమ్మూలోని కత్రా మధ్య ఇటీవలే వందేభారత్ రైలు ప్రారంభమైంది. ఆ రెండు నగరాల మధ్య దూరం 655 కిలోమీటర్లు. చైర్ కార్ టికెట్ ధర రూ. 1,665 కాగా, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ధర రూ. 3,055. సికింద్రాబాద్–విశాఖ నగరాల మధ్య దూరం 657 కిలోమీటర్లు. అంటే ఇంచుమించుగా.. అవే టికెట్ ధరలు ఉండొచ్చని అంచనా. సికింద్రాబాద్ – విశాఖపట్నం వందేభారత్ రైలు సమయాలు సికింద్రాబాద్ – విశాఖపట్నం నగరాల మధ్య ప్రతిరోజూ వందేభారత్ రైలు నడుస్తుంది. ఉదయం 5.45 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మధ్యాహ్నం 2.25 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మధ్యలో రాజమండ్రి(8.08), విజయవాడ(9.50), వరంగల్(12.05)లో ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి రాత్రి 11.25 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుంది. మధ్యలో వరంగల్ (4.25), విజయవాడ (7.10), రాజమండ్రి (9.15)లో ఆగుతుంది.పట్టాలు, కోచ్‌లు, ఇంజన్లు, సిగ్నల్, స్టేషన్లు ప్రజలవి. లాభాలు మాత్రం కార్పొరేట్లవి. రైల్వేను ప్రభుత్వం నిర్వహిస్తుంది కాబట్టి కరోనా సమయంలో రైల్వే కోచ్‌లను తాత్కాలిక ఆసుపత్రులుగా మార్చింది. కానీ అదే ప్రైవేట్ పరం అయితే ఇది సాధ్యమవుతుందా? ఆ సమయంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రులే చేతులెత్తేశాయి. రైల్వే ప్రైవేటీకరణ వలన సామాన్య ప్రజలు రైలు ప్రయాణానికి దూరం అవుతారు. ఉద్యోగాలు రావు, రాయితీలు ఉండవు, రైళ్లు తగ్గుతాయి, చార్జీలు పెరుగుతాయి, యాక్సిడెంట్లు పెరిగి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ప్రజలు కష్టాల్లోకి వెళ్తారు.ఇప్పటివరకు చెన్నై ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) నుంచి హై స్టీల్‌తో తయారుచేసిన భోగీలను నడిపేవారు కానీ ఇప్పుడు వాటి స్థానంలో జర్మనీ దేశపు కంపెనీకి చెందిన ఎల్‌హెచ్‌బీ(ఒఊఖ) నుండి మైల్డ్ స్టీల్‌తో తయారు చేయబడుతున్న భోగీలను ప్రవేశపెడుతున్నారు. ఈ భోగీలు తక్కువ శబ్దంతో అధిక వేగంతో ప్రయాణం చేసినా, చూడటానికి సుందరంగా ఉన్నా, ఇందులో ఏర్పాటు చేసిన టాయిలెట్స్‌ను ఉపయోగించుకోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ కోచ్‌లో డోర్ ముందు నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తుంది. అలాగే ఈ కోచ్‌లో బాత్ రూం డోర్ తియ్యడానికి పెట్టడానికి చిన్న పిల్లలకు, సీనియర్ సిటిజన్స్ కు ఇబ్బందిగా ఉంది. ఐసీఎఫ్ భోగీలు టాయిలెట్స్ లో సౌకర్యవంతంగా ఉపయోగించడానికి వీలుగా ఉండేవి.అలాగే ఈ మధ్య రైల్వే రిజర్వేషన్ కౌంటర్లలో వెయిటింగ్ లిస్ట్‌లో టిక్కెట్లు తీసుకున్న ప్రయాణికులను స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించడానికి అనుమతినిస్తున్నారు. దీనివలన అప్పటికే టికెట్ బుక్ చేసుకొని కన్ఫామ్ అయిన వారు ఇలా వెయిటింగ్ లిస్ట్ వారు భోగీలో ఎక్కడంతో టాయిలెట్స్, లగేజీ పెట్టుకునేందుకు, అలాగే కాస్త అటు ఇటు తిరగడానికి ఇబ్బందిగా ఉంటుంది ఇలాంటప్పుడు స్లీపర్ క్లాస్‌కు జనరల్ భోగికి తేడా ఏమి ఉందని వాపోతున్నారు.

# రాధా వైపు మొగ్గు.. బొండాకు నో ఛాన్స్

విజయవాడ, జనవరి 13 విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టిక్కెట్ వంగవీటి రాధాకు ఇవ్వాలని చంద్రబాబు డిసైడ్ అయినట్లు తెలిసింది. బొండా ఉమామహేశ్వరరావును పక్కన పెట్టే ఛాన్సుంది. తెలుగుదేశం పార్టీ ఎన్నికల వ్యూహకర్త రాబిన్ శర్మ ఇచ్చిన నివేదిక ప్రకారం ఈసారి విజయవాడ సెంట్రల్ టిక్కెట్ వంగవీటి రాధాకు ఇవ్వాలని తేలింది. దీనికి చంద్రబాబు కూడా సుముఖంగా ఉన్నారని చెబుతున్నారు. జనసేన పొత్తు ఉంటే ఆ సీటును కోరే అవకాశముందని భావించి వంగవీటి రాధా పేరును ముందుగానే డిసైడ్ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరేదైనా...? బొండా ఉమను మరొక నియోజకవర్గానికి పంపుతారా? లేక అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇస్తారా? మరీ లేదంటే ఎక్కడైనా పార్లమెంటు టిక్కెట్ ఇచ్చే అవకాశముందా? అన్నది పరిశీలిస్తున్నారు. రాబిన్ శర్మ టీం ఇప్పటికే అనేక సార్లు సర్వేలు నిర్వహించింది. గత ఎన్నికల్లో వైసీ?పీ అభ్యర్థి మల్లాది విష్ణుమీద అతి స్వల్ప తేడాతోనే బొండా ఉమామహేశ్వరరావు ఓటమి పాలయ్యారు. కేవలం ఏడు వందల తేడాతోనే ఓటమి పాలయ్యారు. బొండ ఉమామహేశ్వరరావు టీడీపీ పొలిటికల్ బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు. తక్కువ ఓట్లతోనే... ఈ నేపథ్యంలో ఆయనను తప్పిస్తారా? అన్న చర్చ కూడా లేకపోలేదు. బొండా ఉమ తొలి నుంచి పార్టీని నమ్ముకుని ఉన్నారు. ఆయన 2019లో పార్టీ గెలుపొందకపోయినా పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. అధికార వైసీపీపై విమర్శలు చేయడానికి ముందుంటారు. క్రియాశీలకంగా ఉన్న నేతను తప్పిస్తే రాజకీయ ఇబ్బందులు ఎదురవుతాయన్న భావన కూడా లేకపోలేదు. మరోవైపు వంగవీటి రాధా పార్టీ కార్యక్రమాల్లో గత నాలుగేళ్ల నుంచి పెద్దగా పాల్గొన్నది లేదు. ఆయన అప్పుడప్పుడు ప్రజల్లో కనిపించడం తప్ప పెద్దగా బయటకు వచ్చిందీ లేదు. అయితే వంగవీటి రాధాకు కాపు సామాజికవర్గం అండదండలు పుష్కలంగా ఉండటం, రంగా అభిమానులు ఆయనను మరోసారి ఎమ్మెల్యేగా చూడాలని కోరుకుంటుండటంతో చంద్రబాబు సెంట్రల్ సీటును ఇస్తారన్న టాక్ నడుస్తుంది. మరికొన్ని సీట్లలో... అదే సమయంలో వంగవీటి రాధాకు సెంట్రల్ సీటు కేటాయిస్తే ఖచ్చితంగా గెలుస్తామన్న రాబిన్ శర్మ నివేదిక కూడా ఇందుకు కారణమవుతుందంటున్నారు.

ఇక విజయవాడ తూర్పు నియోజకవర్గాన్ని జనసేనకు ఇవ్వాలని భావిస్తున్నారు. అక్కడి నుంచి నాదెండ్ల మనోహర్ పోటీ చేసే అవకాశాలున్నాయని చెబుతున్నారు. అక్కడ ఉన్న గద్దె రామ్మోహన్ ను గన్నవరం నియోజకవర్గానికి పంపాలని చంద్రబాబు నిర్ణయించారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థిగా కొత్త వారిని ఎంపిక చేయాలన్న ఉద్దేశ్యంతో ఉన్నారు. ఇక్కడ పోటీ ఎక్కువగా ఉండటంతో కొత్త వ్యక్తికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కాబట్టి సమీకరణలు మారొచ్చు. ఆలోచనలు మారే అవకాశాలు కూడా లేకపోలేదు. మొత్తం మీద ఈసారి బెజవాడలో ఉన్న సీట్ల విషయంలో చంద్రబాబు ఆచితూచి వ్యవహరించే అవకాశాలున్నాయన్నది పార్టీ నుంచి అందుతున్న సమాచారం.

# ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయిన గ్రామస్థులు!

కడప , జనవరి 13 కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలోని నర్సిరెడ్డి పల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వైసీపీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. గడపగడప కార్యక్రమానికి ఎమ్మెల్యే వస్తున్నారని తెలుసుకున్న కొందరు ఇళ్లకు తాళాలు వేసి, ఊర్లో లేకుండా వెళ్లిపోయారు. కొన్ని సంవత్సరాలుగా ఊరికి రోడ్డు లేదని ఆ ఊరి ప్రజలకు రోడ్డు వేస్తామని ప్రజా ప్రతినిధులు మాట ఇచ్చి మాట తప్పారని గ్రామస్థులు వాపోయారు. ఇలా చేయడం ఇది మొదటిసారి కాదని గతంలో కూడా ఎంపీపీ జడ్పీటీసీలు దేవుని దగ్గర ప్రమాణం చేసి మీ ఊరికి అంతా మంచి చేస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. మౌలికవసతులు కల్పించడంలో విఫలమయ్యారని అందుకే ఇలా చేశామని గ్రామస్థులు అంటున్నారు. “మా ఊరికి ఉంది మామూలు తోవే. దానిని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఎవరొచ్చి ఏం చేసేదేం లేదు. వీళ్లను వాళ్లు వాళ్లను వీళ్లు తిట్టుకోవడం తప్పితే ఎవరూ ఏం చేయడంలేదు. ప్రజలకు ఏం చేసేదేంలేదు. వాళ్లకు అనుకూలంగా ఉన్న వాళ్లకు చేసుకుంటున్నారు. మా ఊరికి రోడ్డు వేస్తామని ప్రమాణం కూడా చేశారు. జడ్పీటీసీ ఎన్నికల సమయంలో ఊరికి రోడ్డు వేస్తామని ప్రమాణం కూడా చేశారు. కానీ ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోలేదు. ఊరి ప్రజలకు కావాల్సింది రోడ్డు. పోయిన ఎన్నికల ముందు రోడ్డు విడగొట్టారు వేస్తామని కానీ అది అలానే ఉంది. నేను పుట్టినప్పుడు ఎలా ఉందో ఇప్పుడూ ఆ రోడ్డు అలానే ఉంది. నాకు ఇప్పుడు 76 ఏళ్లు వచ్చాయి. పార్టీల కోసం నిలబడి ఓట్లు వేయించాం. కానీ ఇప్పటి వరకూ రోడ్డు లేదు. నాయకుల్ని పోయి అడాలంటున్నారు వాళ్లను అడిగేటట్లు అయితే వీళ్లెందుకు ఓట్లు కోసం వస్తున్నారు. ఎవరూ చేసిందేం లేదు ఎవరి స్వార్థాలు వాళ్లవి.” – నర్సిరెడ్డి పల్లి గ్రామస్థుడు గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని సీఎం జగన్ ... మంత్రులు, ఎమ్మెల్యేలను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే ఎమ్మెల్యేల పనితీరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేసిన వారికి సీఎం జగన్ వార్నింగ్ కూడా ఇచ్చారని తెలుస్తోంది. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని సీఎం జగన్ ఇప్పటికే ఆదేశించారు. అయితే వైసీపీ నేతలకు మాత్రం గడప గడపకు కార్యక్రమంలో నిరసన సెగలు తప్పడంలేదు. సంక్షేమ పథకాల విషయంలో కొందరు వివక్ష చూపిస్తున్నారని, తమకు పథకాలు అందడంలేదని కొందరు ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు. మంత్రులకు సైతం చేదు అనుభవం ఎదురైన ఘటనలు ఉన్నాయి. ఇటీవల మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణకు గడప గడపకు కార్యక్రమంలో నిరసన సెగ తగిలింది. శ్రీ సత్య సాయి జిల్లా రొద్దం మండలంలో ఎమ్మెల్యే శంకర్ నారాయణ గడపగడపకు కార్యక్రమంలో పర్యటించారు. ఈ క్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు హరికృష్ణ ఇంటి వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే శంకర నారాయణను గ్రామంలోని సమస్యలపై హరికృష్ణ నిలదీశారు. దీంతో అసహనానికి గురైన ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు వైసీపీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చేపట్టిన పనులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మర్రిపాడులో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఎమ్మెల్యే కాళ్లపై పూలు చల్లించడం వివాదం అయింది. గ్రామంలో సమస్యలపై ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలపై, విక్రమ్ రెడ్డి అనుచరులు దౌర్జన్యానికి దిగడంపై విమర్శలు వచ్చాయి. సంక్షేమ పథకాలు అందకుండానే అందినట్టు కరపత్రాలు ముద్రించారని కొందరు మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

# 15 మంది అధికారులపై సోమేశ్ కుమార్ ప్రభావం

విజయవాడ, జనవరి 13 సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్ ఏపీకి వెళ్లారు. ఆయన ఏపీ సీఎస్ జవహర్ రెడ్డిని కలిశారు. ఆ తర్వాత ఇద్దరూ ఒకే కారులో వెళ్లి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. అయితే ఇప్పుడు ఏపీలో పనిచేయడానికి సోమేశ్ కుమార్ ఆసక్తి చూపుతారా? లేక వీఆర్ఎస్ తీసుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. సోమేశ్ కుమార్ సీఎం జగన్ చాలాసేపు భేటీ అయ్యారు. పలు విషయాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. అయితే ఆంధ్రప్రదేశ్ కు వెళ్లడానికి మొదటి నుంచీ ఆసక్తి చూపని సోమేశ్ కుమార్.. ప్రస్తుత పరిస్థితుల్లో స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తారని ప్రచారం జరుగుతోంది. వీఆర్ఎస్ తీసుకోవాలంటే ముందుగా ఏపీలో జాయినింగ్ రిపోర్ట్ సబ్మిట్ చేయాలి. ఆపై వీఆర్ఎస్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. జాయిన్ కాకుండా వీఆర్ఎస్ ప్రక్రియ ముందుకెళ్లే అవకాశం లేదు. ఈ కారణంగానే సోమేశ్ కుమార్ ఏపీలో రిపోర్ట్ చేశారని అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు సోమేశ్ కుమార్ ఏం చేయబోతున్నారనదేది తెలుగు రాష్ట్రాల్లో ఆసక్తిగా మారింది. సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్ తర్వాత ఎవరు ఏపీకి వెళ్లేది? ఇప్పుడిదే తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది. సీనియర్ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్ సొంత కేడర్ అయిన ఆంధ్రప్రదేశ్‌కి వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం, ఆయన్ను రిలీవ్ చేయడం, తెలంగాణకు కొత్త సీఎస్‌గా శాంతికుమారి నియామకం అన్నీ చక చకా జరిగిపోయాయి. అయితే 1989 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్ 2014లో రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు కేటాయించారు. అయితే సోమేశ్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) నుండి క్లియరెన్స్ పొందడం ద్వారా తెలంగాణలోనే కొనసాగారు. అనంతర కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా అయ్యారు. అయితే క్యాట్ తీర్పుపై తెలంగాణ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయగా, దానిని కొట్టివేసింది. దీంతో కేంద్ర ప్రభుత్వం సోమేశ్ కుమార్‌ను అతని మాతృ (ఆంధ్రప్రదేశ్) కేడర్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించింది. కేంద్ర ఉత్తర్వులు తమకు కేటాయించకుండా తమకు నచ్చిన రాష్ట్రాల్లో పని చేస్తున్న మరో 15 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పోస్టింగ్ పై ప్రభావం చూపనుంది. ఐపీఎస్ అధికారుల్లో తెలంగాణ డీజీపీ అంజనీకుమార్, అదనపు డీజీ అభిలాష బిస్త్, అభిలాష్ మహంతి తెలంగాణలో పనిచేస్తుండగా వారిని మొదట ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించారు. ఏపీలో తెలంగాణ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు మనీష్ కుమార్ సింగ్, అమిత్ గార్గ్, అతుల్ సింగ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్నారు. ఐఏఎస్ కేడర్ నుంచి సోమేశ్ కుమార్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌కు మొదట కేటాయించిన వాణీప్రసాద్, వాకాటి కరుణ, రోనాల్డ్ రోజ్,ఎం.ప్రశాంతి, కె.ఆమ్రపాలి ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో పనిచేస్తున్నారు. వీరితో పాటు తెలంగాణ కేడర్ అధికారులు హరికిరణ్, సృజన, శివశంకర్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పనిచేస్తున్నారు. మరి ఈ అధికారులను అసలు రాష్ట్రానికి తరలించాలని కేంద్రం కూడా ఆదేశాలు జారీ చేస్తుందో లేదో చూడాలి.

# వైఎస్ఆర్‌సీపీలో పదవుల హడావుడి

విజయవాడ, జనవరి 13 ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్‌సీపీలో పదవుల హడావుడి ప్రారంమయింది. ఈ ఏడాది ఈ ఏడాది 23 శాసన మండలి పదవులు ఖాళీ కానున్నాయి. ఎన్నికలు జరగనున్న స్థానాలు తప్ప అన్నీ వైసీపీకి దక్కనున్నాయి. ఎన్నికలు జరిగే వాటిరోనూ వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులు గెలుపొందవచ్చు. కానీ ఎన్నికలు లేకుండా పదవి పొందే అవకాశం వైసీపీ నేతలకు వచ్చింది. ఈ ఏడాది ఎమ్మెల్సీగా ఎన్నికైతే 2029 వరకు వారు ఆ పదవిలో కొనసాగే అవకాశముంది. 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా ఆరేళ్ళపాటు ఎమ్మెల్సీ పదవిలో కొనసాగవచ్చు. దీంతో ఎమ్మెల్సీ పదవికి భారీ డిమాండ్ పెరిగింది. పలు జిల్లాల్లో సీనియర్ నాయకులు సైతం ఎమ్మెల్సీ పదవులకు పోటీపడున్నారు. 2019 ఎన్నికల్లో 175 అసెంబ్లిట స్థానాలకు గాను 151 సీట్లు సాధించిన వైసీపీ శాసన సభలో తిరుగులేని ఆధిక్యతను సొంతం చేసుకుంది. శాసన మండలిలో మెజార్టీ లేకపోవడంతో సీఎం జగన్‌కు తలనొప్పిగా మారింది. ఒకదశలో శాసన మండలిని రద్దు చేయాలనే ప్రతిపాదన చేశారు. తీర్మానం పంపారు. అయితే కేంద్రం ఆమోదించలేదు. కానీ తర్వాత జగన్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. పలువురు టీడీపీ సభ్యుల పదవికాలం పూర్తవ్వడంతో వైసీపీ బలం పెరిగిం ది. మండలిలో ఇప్పుడు మెజార్టీ కూడా వైసీపీదే. తాజాగా 23 స్థానాలు భర్తీ కావాల్సి ఉండటం తో శాసన మండలిలోనూ పూర్తిగా వైసీపీ ఆధిక్యత చూపించనుంది. శాసన మండలి లో టీడీపీ ప్రాతినిధ్యం పరిమితం కానుంది. ఖాళీ అవుతున్న ఎమ్మెల్సీ స్థానాల్ని ఎమ్మెల్యే, గవర్నర్ కోటాలతో పాటు స్థానిక సంస్థల కోటాతో భర్తీ చేయాల్సి ఉంటుంది. అ ఎమ్మెల్యే కోటాలో భర్తీ కావాల్సిన 7 స్థానాలు గవ ర్నర్ కోటాలో భర్తీ అయ్యే రెండు స్థానాలు, వైసీపీ సొంతం అవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఫ్యాన్ స్పీడ్ ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయి. మున్నెన్నడూ లేనంతగా పంచాయితీ నుంచి జిల్లా పరిషత్‌ల వరకు వైసీపీ తిరుగులేని ఆధిపత్యంలో నిల్చింది. స్థానిక సంలటస్థల కోటాలో భర్తీ కావా ల్సిన 9 స్థానాలు వైసీపీ ఖాతాలోనే జమకానున్నా యి. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ నియోజక వర్గాల్లో భర్తీ కావాల్సిన ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ ఉత్కంఠభరితంగా జరగనుంది. ఆ స్థానాల్లో పీడీఎఫ్ బలమైన పోటీ ఇవ్వనుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఐదు స్థానాల్లో కనీసం రెండు సీట్లు దక్కించుకున్నట్లైతే 23కు 20 ఎమ్మెల్సీ స్థానాలు వైసీపీ సొంత అవుతాయి. పదవులు ఆశించే నేతలు పార్టీ పెద్దలను కలిసి తమ మనసులో మాట చెబుతున్నారు. పార్టీ పెద్దల వద్ద ఇప్పటికే తమ మనసులో మాట బయటపెట్టిన ఆశావహులు సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసి హామీ తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల వేడి పెరగడంతో ఎమ్మెల్సీ పదవుల భర్తీలో ఆచితుచి వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఎమ్మెల్సీ పదవుల ఆశిస్తున్న ఆశావహులకు తనను కలిసే ఛాన్స్ కూడా జగన్ ఇవ్వడం లేదని చెబుతున్నారు. జిల్లాల వారీగా సామాజిక సమీకరణల్ని ముఖ్య అనుయాయులతో జగన్ బేరీజు వేస్తున్నట్లు తెలుస్తోంది.

# చిరంజీవికి ఏపీ పొరుగు రాష్ట్రమా

విజయవాడ, జనవరి 13 మెగాస్టార్ చిరంజీవి ఏపీ రాజికీయాలకు దూరంగా ఉంటానని తేల్చి చెప్పారు. తాను వంద శాతం రాజకీయాల్లోకి తిరిగి రానని చెప్పారు. ఒక టీవీ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పొరుగు రాష్ట్ర రాజకీయాలతో తనకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. రాజకీయాలకు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్, సినిమాలకు మాత్రం సొంత రాష్ట్రమయిందా? అన్న ప్రశ్నలను నెటిజన్లు వేస్తున్నారు. మెగాస్టార్ కు ఏపీతోనే అనుబంధం ఎక్కువ. అక్కడే అభిమానులు ఎక్కువ. అక్కడే పుట్టి .. అక్కడే పెరిగి ఇంతవాడయిన చిరంజీవికి ఏపీ పొరుగు రాష్ట్రమయిందా? అన్న ప్రశ్నలు వినపడుతున్నాయి. పొరుగు రాష్ట్రంగా... రాజకీయాలంటే ఇష్టం లేకపోవచ్చు. అంతవరకే చిరంజీవి పరిమితమయితే బాగుండేది. కానీ ఏపీని పొరుగు రాష్ట్రంగా ఆయన నోటి నుంచి రావడంతో మెగా అభిమానులు నొచ్చుకుంటున్నారు. చిరంజీవి సినిమాలకు అత్యధిక షేర్ ను అందించేది ఆంధ్రప్రాంతమే. అక్కడే ఆయన ఇటీవల తన వాల్తేరు వీరయ్య ప్రీ రిలీజ్ ఈవెంట్ ను కూడా నిర్వహించారు. విశాఖలో ఇల్లుకట్టుకోవాలని ఉందని ఆకాంక్షను వెలిబుచ్చారు. విశాఖ అంటే తనకు ఎనలేని ప్రేమ అని చెప్పుకొచ్చారు. అయితే ఏపీ రాజకీయాలంటేనే చిరంజీవికి విరక్తి కలిగిస్తున్నాయి. ఓటమే కారణమా? అందుకు ప్రధాన కారణం ఆయనను 2009లో పాలకొల్లులో ఓడించడమేనని అంటున్నారు. తన అంచనాలుకు భిన్నంగా ఆరోజు ప్రజారాజ్యం పార్టీకి పెద్దగా సీట్లు రాకపోవడంపైనకూడా ఆయన కలత చెందారంటున్నారు. ప్రజారాజ్యం పెట్టి ముఖ్యమంత్రిని అయిపోతానని భావించిన చిరంజీవి నాడు పద్దెనిమిది సీట్లకే పరిమితమయ్యారు. పాలకొల్లులో ఓడి, తిరుపతిలో గెలిచిన చిరంజీవి తర్వాత ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు. తర్వాత రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ అయి కేంద్ర మంత్రి పదవి కూడా చేపట్టారు. కానీ రాష్ట్రాన్ని విడగొట్టడంతో చిరంజీవి ఎటూ కాకుండా పోయారు. ఆ తర్వాత ఆయన తిరిగి సినిమాల్లోకి రీఎంట్రీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి కూడా దూరంగా ఉన్నారు. నేరుగా మద్దతు కూడా... నిజానికి తన సోదరుడు పవన్ కల్యాణ్ పెట్టిన పార్టీకి నేరుగా వచ్చి ప్రచారం చేయకపోయినా ఒక ప్రకటన ద్వారా మద్దతిస్తారని మెగా అభిమానులు భావించారు. కానీ చిరంజీవి ఆ పని కూడా చేయరని అర్థమయింది. ఆయన ఏపీ రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉండాలని భావిస్తున్నట్లుంది. చిరంజీవి తొలి నుంచి వివాదాలకు దూరంగా ఉంటారు. ఆయన చేసే వ్యాఖ్యలు కూడా ఆచితూచి చేస్తారు. ఎవరినీ నొప్పించరు. తనపై విమర్శలు చేసిన వారిని కూడా పెద్దగా పట్టించుకోరు. అలాంటి చిరంజీవి తన తమ్ముడు పవన్ కల్యాణ్ కోసం ఏపీ రాజకీయాల్లో వేలుపెడతారనుకోవడం భ్రమే అవుతుంది. పవన్ అందలమెక్కితే సంతోషిస్తారు. రాజకీయంగా నష్టపోతే బాధపడతారు. పరోక్షంగా నిధులు వంటి వాటి విషయంలో సాయం చేయవచ్చేమో కాని ప్రత్యక్షంగా మద్దతును మాత్రం ప్రకటించరన్నది ఆయన మాటలతో స్పష్టమయింది.

## సోషల్ మీడియా వేదికగా టీడీపీ-వైసీపీ మధ్య పోరు



విజయవాడ, జనవరి 13 డ్డా ఏదైనా.. పొలిటికల్ యుద్ధంలో తగ్గేదేలే అంటున్నాయి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పార్టీలు. అధికారం కోసం నువ్వా నేనా సై అంటూ దుమ్మురేపుతున్నాయి. రాజకీయంగా ప్రత్యక్ష రణ క్షేత్రంలో నేతల మధ్య మాటల తూటాలు పేలుతుంటే.. సెకన్ల వ్యవధిలో ప్రపంచాన్ని చుట్టేసే సోషల్ మీడియా వేదికగా వీడియోల యుద్ధం చేస్తున్నాయి. తాజాగా సోషల్ మీడియా వేదికగా టీడీపీ–వైసీపీ మధ్య పోరు పీక్స్‌క్ చేరింది. ఒకరిపై ఒకరు సెటైర్లు, విమర్శలు చేసుకుంటూ కామెంట్స్, ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేస్తున్నారు రెండు పార్టీలకు చెందిన నేతలు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోలు ఏపీ రాజకీయాలను మరింత రక్తి కట్టిస్తున్నాయి.తాజాగా ట్విట్టర్‌లో అధికార వైసీపీకి వ్యతిరేకంగా టీడీపీ సోషల్ మీడియా వింగ్ ఓ వీడియో షేర్ చేసింది. అందులో ‘సైకోపోవాలి.. సైకిల్ రావాలి.. ఇదే ప్రజా తీర్పు కావాలి.’ అంటూ పాటను క్రియేట్ చేసి వీడియోను పోస్ట్ చేసింది టీడీపీ. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుండగా.. వెంటనే రియాక్ట్ అయ్యింది అధికార వైసీపీ. తమ పార్టీకి చెందిన వీడియోను కాపీ కొట్టి ‘కాపీ క్యాట్స్’ అంటూ సెటైర్లు వేసింది. ‘చీప్, ఫేక్, కాపీ క్యాట్స్’ అని విమర్శిస్తూ ఒరిజినల్ వీడియోను షేర్ చేసింది వైసీపీ. ‘బైబై బాబు.. బైబై బాబు.. బైబై పప్పు.. ఇదే ప్రజా తీర్పు కావాలి’ అంటూ పాటతో ఉన్న వీడియోను షేర్ చేసింది వైసీపీ.ఇలా అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ లు సోషల్ మీడియా వేదికగా యుద్ధం సాగిస్తున్నాయి. జనాలను అట్రాక్ట్ చేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర అనే సంగతి తెలిసిందే. మరి ఇంత తెలిసిన రాజకీయ పార్టీలు కొంచెమైనా సందు దొరకనిస్తాయా? ఛాన్సే లేదు. మొత్తానికి ఈ రెండు పార్టీలు తమ తమ స్టైల్లో వీడియోలు ఎడిట్ చేసి పొలిటికల్ వార్ చేస్తున్నాయి. మరి జనాలు వీటిని ఎలా రిసీవ్ చేసుకుంటారు? వారి రియాక్షన్స్ ఏంటి అనేది ఎన్నికల ఫలితాలు చెబుతాయి.

## పల్లెకు పోదాం? పండగ చెద్దాం

సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వెళ్లేవారి తో హైదరాబాద్ విజయవాడ రహదారి వాహనాల ట్రాఫిక్ జామ్ తో కిక్కిరిసి పోయింది. ట్రాఫిక్ జామ్ తో రోడ్లన్నీ రద్దీగా మారాయి. కుటుంబ సభ్యులతో కలిసి బస్టాండ్ ల వద్ద బారులు తీరారు....దీంతో బస్టాండ్లు ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోయాయి.తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడంతో బస్సుల్లోనే ప్రయాణించేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. చాలామంది తమ సొంత వాహనాల్లోనే కాకుండా ఆర్టీసీ బస్సులు ,ప్రైవేట్ వాహనాలలో ప్రయాణాలు చేస్తున్నారు. ప్రతి పది నిమిషాలకు ఒకసారి బస్సులు ఏర్పాటు చేశారు. ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని ఈనెల 10వ తారీకు నుండి 15వ తారీఖు వరకు నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికుల కొరకు రోజువారీగా 100 బస్సులు ఏర్పాటు చేశారు. రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల కొరకు కుడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు

# బాపట్లలో చిరంజీవి ఫ్యాన్స్‌ను దువ్వుతున్న కోన వెంకట్

విజయవాడ, జనవరి 13 సినీ రచయిత కోన వెంకట్ బాపట్లలో చిరంజీవి అభిమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్యకు కోన వెంకట్ కథ, స్క్రీన్ ప్లే అందించారు. కోన వెంకట్ స్వస్థలం బాపట్ల. ఆయన సమీప బంధువు కోన రఘుపతి బాపట్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ సందర్భంగా బాపట్ల వచ్చిన ఆయన చిరంజీవి అభిమానులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. చిరంజీవి అభిమానులు కోన వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. కోన వెంకట్ నిర్వహించిన ఫ్యాన్స్ మీటింగ్‌లో చిరు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఇంత వరకు బాపట్లలో ఏ సినిమా హీరో అభిమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయలేదని .. మెగాస్టార్ చిరంజీవి చిత్రానికి కథ స్క్రీన్ ప్లే సమకూర్చిన కోన వెంకట్ చిరంజీవి అభిమానులతో సమావేశం ఏర్పాటు చేయడం సంతోషమని ఫ్యాన్స్ చెప్పుకొచ్చారు. .మెగాస్టార్ చిరంజీవిని ఏ విధంగా అయితే మన ఊహించుకుని ఇష్టపడ్డామో, ఎలాంటి చిత్రాలను చూసి అయితే మనం అభిమానులుగా మారామో వాటిని మించి వాల్తేరు వీరయ్య చిత్రం అలా ఉంటుందని హామీ ఇచ్చారు. మెగాస్టార్ చిరంజీవితో బాపట్ల నుంచి అభిమానులను ఫోటో సెషన్ ఏర్పాటు చేయాలని అభిమానులు కోరారు. బాపట్ల నుంచి ఒక 50 మంది అభిమానులను మెగాస్టార్ చిరంజీవితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించి అభిమానులకు ఫోటో సెషన్ ఏర్పాటు చేయిస్తానని కోన వెంకట్ హామీ ఇచ్చారు. అయితే కోన వెంకట్ చిరంజీవి ఫ్యాన్స్ ను దువ్వేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఆయన భేటీ వెనుక రాజకీయం కూడా ఉందన్న చర్చ జోరుగా నడుస్తోంది. కోన ఫ్యామిలీ వైసీపీలో ఉంది. ఇటీవలి కాలంలో జనసేన పార్టీ .. వైసీపీకి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విబేధాలు పెరిగాయి. పవన్, చిరంజీవిపై వైఎస్ఆర్‌సీపీ నేతలు చేస్తున్న కామెంట్లుతో వారి అభిమానులంతా వైసీపీకి దూరమయ్యారు. అంతే కాకుండా వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే.. బాపట్లలో బలంగా ఉన్న .. ఓ సామాజికవర్గం పూర్తిగా వైసీపీకి దూరమవుతుందని అదే జరిగితే.. తన సోదరుడు రాజకీయ ఎదుగదలకు అడ్డంకి అవుతుందని కోన వెంకట్ భావిస్తున్నారని అందుకే.. ముందుగా మెగాస్టార్ అభిమానుల్ని దువ్వుతున్నారని చెబుతున్నారు. లేకపోతే సినిమా సాకుతో బాపట్లలోనే ఎందుకు సమావేశం పెట్టారని కొంత మంది ప్రశ్నిస్తున్నారు. కోన వెంకట్ కూడా రాజకీయంగా చురుకుగా ఉంటారు. వైసీపీ కోసం ఆయన తరచూ సోషల్ మీడియాలో ట్వీట్లు పెడుతూనే ఉంటారు.

# రెండు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ట్రయల్ రన్

రాజమహేంద్రవరం, జనవరి 13 గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు మార్గం సుగమమైంది. రిజిస్ట్రేషన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం.. తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా తొలుత 51 గ్రామ, వార్డు సచివాలయాలను ఎంపిక చేసింది. ఎలాంటి భూ వివాదాలు లేని, సమగ్ర భూ సర్వే పూర్తయిన 33 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఈ ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టుగా కొవ్వూరు నియోజకవర్గం తోగుమ్మి, రాజానగరం నియోజకవర్గం భూపాలపట్నం సచివాలయాల్లో సేవలను ఇప్పటికే ప్రారంభించింది. త్వరలో నిర్దేశించిన 31 సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేస్తోంది.స్థిర, చరాస్తులు, విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాల్సిందే. ఈ క్రమంలో అక్కడున్న డాక్యుమెంట్ రైటర్లు, దళారులు నిర్ణయించిన ధర చెల్లించాల్సి వచ్చేది. లేని పక్షంలో డాక్యుమెంట్లు సక్రమంగా లేవంటూ కొర్రీలు పెట్టి వెనక్కు పంపుతున్న సంఘటనలు కోకొల్లలు. కొందరు సబ్ రిజిస్ట్రార్లు దళారులతో కుమ్మక్కు కావడంతో అక్రమ తంతు యథేచ్ఛగా నడిచేది. అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందేలా చర్యలు తీసుకుంది. భూముల అమ్మకం, కొనుగోళ్లకు సంబంధించిన లావాదేవీలన్నీ సచివాలయ కేంద్రంగానే చేపట్టేలా ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టింది. ప్రక్రియ సమర్థవంతంగా జరగాలంటే భూముల వివాదాలు ఉండకూడదని భావించింది. సమగ్ర భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో అయితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావించి తొలుత అలాంటి గ్రామాలను ఎంపిక చేసింది.

రిజిస్ట్రేషన్ ప్రక్రియపై గ్రామ సచివాలయ సిబ్బందికి జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఇప్పటికే అవగాహన కల్పించారు.

ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేసి మరీ డాక్యుమెంట్ల పరిశీలన, చలానా తదితర విషయాలపై సమగ్రంగా సమాచారం అందించారు.

ఇది వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందే సేవలన్నీ సచివాలయాలకు అనుసంధానం చేశారు.

అక్నాలెడ్జ్‌మెంట్ అప్‌డేట్, డేటా ఫీడింగ్, చెక్‌స్లిప్, రెగ్యులర్ నంబర్ కేటాయింపు, ఫొటో, వేలిముద్రలు తీసుకోవడం, డాక్యుమెంట్ ప్రింటింగ్, స్కానింగ్, దస్తావేజు, సెటిల్‌మెంట్ దస్తావేజు, దాన విక్రయ, తనఖా, చెల్లు రశీదు, భాగ పరిష్కార రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వివాహ రిజిస్ట్రేషన్ తదితర సేవలు ఉన్న ఊళ్లోనే అందుతాయి.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేందుకు సచివాలయంలో ఒక పంచాయతీ సెక్రటరీకి ప్రభుత్వం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ హోదా కల్పించింది.

ఇకపై సచివాయలంలో జరిగే స్థిర, చరాస్తి క్రయ, విక్రయాల విక్రయం, కోనుగోలుపై పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే రెండు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ రెండింటిలోనూ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గం తోగుమ్మిలో ఇప్పటి వరకు 101 రిజిస్ట్రేషన్లు జరిగ్గా వీటి విలువ రూ. 26,58,522గా ఉంది. రాజానగరం నియోజకవర్గం భూపాలపట్నంలో రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. లేఅవుట్లు ఎక్కువగా ఉన్న కారణంతో భారీగా ఆదాయం సమకూరినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఇప్పటి వరకు రూ. 16,96,53,581 విలువ చేసే 302 స్థిర, చరాస్తులు రిజిస్ట్రేషన్లు జరగ్గా.. రూ. 73,23,939 ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది.

త్వరలో మరిన్ని గ్రామాల్లో.. జిల్లాలో త్వరలో మరిన్ని గ్రామాల్లో సేవలు ప్రారంభం కానున్నాయి. అందులో నేలటూరు, నందిగంపాడు, జగన్నాథపురం, జగన్నాథపురం(గంగవరం), చిడిపి, తిమ్మరాజుపాలెం, బల్లిపాడు, పేరరామచంద్రపురం, అనవర్తి?5, కొవ్వవరం, మహేంద్రవాడ?1, పోలమూరు?1, రామవరం?1, కుతుకులూరు?1, పెదపర్తి, పూలగుర్త, ఇల్లపల్లి, ఇల్లపల్లి(తుమ్మలాపల్లి), ఇల్లపల్లి(రాళ్లకండ్రిగ), కోమరిపాలెం?2, తొస్సిపూడి, పందలపాక?1,కొంకుదురూరు?1, దామిరెడ్డిపల్లి, బొమ్మూరు?2, రాజవోలు?1, శ్రీకృష్ణపట్నం, జి.ఎర్రవరం, నామవరం, సుభద్రంపేట, నార్త్ తిరుపతి రాజాపురం సచివాలయాల్లో త్వరలో సేవలు అందుబాటులోకి వస్తాయి.

# చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మరోసారి బయటపడ్డ డాక్టర్ల నిర్లక్ష్యం

## ఆపరేషన్ చేసే ప్లేట్లు లేవని మధ్య లోనే ఆపరేషన్ నిలిపేసిన వైనం

చిత్తూరు ఎముకల సర్జీరీలలో వాడే ప్లేట్లను కూడా సమకూర్చుకోకుండా ఆపరేషన్ ప్రారంభించి , ఆ ప్లేట్లు లేవని డాక్టర్ ఆపరేషన్ నిలిపివేసారు. వివరాలు ఇలా వున్నాయి. యాదమరి మండలం దళవాయిపల్లికి చెందిన పుష్పమ్మ అనే వృద్దురాలికి ప్రమాదవశాత్తు కాలు విరిగింది. చిత్తూరు హాస్పిటల్ లో ఆపరేషన్ చేసుకుందామని వచ్చిన పుష్పమ్మను(62) ను ఎక్సరేలు, స్కానింగ్ లు ఇతరత్రా టెస్టులన్ని బయట ప్రైవేటుగా చేసుకోవాలని ముప్పతిప్పలు పెట్టారు. అన్ని టెస్ట్ లు స్వంత ఖర్చులతో ప్రైవేటుగా చేయించాక ఆపరేషన్ ప్రారంభించారు. ఆపరేషన్ ప్రారంభించిన అనంతరం ఎముకకు అమర్చాల్సిన ప్లేటు ప్రభుత్వ హాస్పిటల్ లో లేదని తెలియడంతో ఆపరేషన్ ను అర్ధాంతరంగా ఆపేసారు. విషయం పుష్పమ్మ కుమారుడికి చెప్పారు. తరువాత వెంటనే పుష్పమ్మ ఆరోగ్యం నిలకడగా లేదని , ఆమె శరీరం సర్జరీకి సహకరించడం లేదని సామాచారం ఇచ్చారు. చేసేదేది లేక పుష్పమ్మను ప్రైవేటు హాస్పిటల్ కు తరలించాడు. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని బాధితులు కోరుతున్నారు

# మంత్రి నాగార్జున దళిత ద్రోహి

## జగన్ రెడ్డి మెప్పు కోసం జాతికి ద్రోహం చేస్తున్నాడు

## ఎం.ఎస్.రాజు

అమరావతి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తన పదవి కాపాడుకునేందుకు సొంత సామాజిక వర్గాన్ని మోసం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు ఆరోపించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ నిధులు రూ.7 వేల కోట్లు దారిమళ్లించిందని ప్రభుత్వానికి హైకోర్టు మొట్టికాయలు వేస్తే మంత్రి తేలుకుట్టిన దొంగలా మౌనం వహించడం దేనికి నిదర్శనం? నోరెత్తితే తన పదవి ఊస్టింగ్ అవుతుందని కాదా? జగన్ రెడ్డి అత్యంత కర్కశంగా ప్రశ్నించే గళాల గొంతు నొక్కడానికి తీసుకొచ్చిన జీఓ నెం 1 ను సస్పెండ్ చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేస్తే పదవిని కాపాడుకునేందుకు, జగన్ రెడ్డి మెప్పు పొందేందుకు వెంటనే స్పందించారు. దళితులకు అన్యాయం జరిగితే మాట్లాడని మంత్రి, ఇప్పుడు మాట్లాడడం జాతికి ద్రోహం చేసినట్లు కాదా అని ప్రశ్నించారు.తన సిఎం పదవికి బీటలు వారుతున్నాయనే భయంతోనే ఏ1... జీవో 1 తెచ్చారు. ఇది పేదల ముసుగులో ప్రజాస్వామ్యం గొంతునొక్కడానికి తెచ్చిన జీవో. పేదల కోసమే జగన్ జీవో తెచ్చాడని మేరుగ చెప్పడం సొంత సామాజిక వర్గాన్ని జీఓ-01కు బలిపశువులను చేయడమే. దేశంలోనే అతి పెద్ద పెత్తందారు అయిన జగన్ రెడ్డి పేదల కోసం జీవో తెచ్చాడంటే ఎలా నమ్మాలి? పేదల భూములు లాక్కుని అసెంబ్లీ సాక్షిగా దొరికిన చరిత్ర జగన్ రెడ్డి కుటుంబానిది. జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో 21 వేల మంది పేదలు ఉపాధి దొరక్క ఆత్మహత్యలకు పాల్పడ్డారని పార్లమెంటు సాక్షిగా రుజువైంది. జగన్ రెడ్డి మోసకారి సంక్షేమం, పరిపాలన, జగన్ రెడ్డి నిజస్వరూపం పార్లమెంటులో బయటపడినా..మంత్రులు మాత్రం జగన్ రెడ్డిని వెనకేసుకు రావడం తమ సామాజిక వర్గాలకు ద్రోహం చేయడం కాదా? ఈ దగుల్బాజీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులు, హత్యలు చేస్తున్న పరిస్థితుల్లో సొంత సమాజికవర్గానికి అండగా నిలబడాల్సిన మంత్రి, జగన్ రెడ్డిని వెనకేసుకురావడం దళితులకు ద్రోహం చేసినట్లు కాదా? ఒక దళిత శాసన సభ్యుడి తల్లి శీలాన్ని శాసనసభా వేదిక శంకించిన మంత్రి మేరుగ నాగార్జున దళిత ద్రోహిగా మిగిలిపోతాడు. దళితులకు అన్యాయం చేసిన ఏ ఒక్కడూ రాజకీయాల్లో మనుగడ సాధించినట్లు దాఖలాలు లేవు. మంత్రి నాగార్జున ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా జగన్ రెడ్డి మెప్పు పొందవచ్చేమో కాని, దళితుల అభిమానాన్ని పొందలేడు. జగన్ రెడ్డి, మంత్రి మేరుగ నాగార్జున ఇద్దరూ దళిత ద్రోహులే. వీళ్లను రానున్న ఎన్నికల్లో దళితులు ఇంటికి సాగనంపడం ఖాయమని అన్నారు.

# రూరల్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నా

## -నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు నెల్లూరు రూరల్ లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు తీసుకురావడంలో తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 26వ డివిజన్ విక్రమ్ నగర్ పార్క్ వద్ద శుక్రవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలని మిగిలిన సమయంలో అభివృద్ధి పై ప్రత్యేక దృష్టిసారించడమే తన లక్ష్యమన్నారు. నెల్లూరు రూరల్ లో స్థానికంగా ఏ సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా చెప్పారు. స్థానిక సంస్థల పరిష్కారం కోసమే గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బూడిద సుప్రజ, స్థానిక డివిజన్ వైకాపా ఇంచార్జ్ బూడిద పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# అనాధ పిల్లలను ఆదుకోవాలి

# డా" కొప్పుల విజయ్ కుమార్

కడప సిటి జనవరి 13:(ఉదయం న్యూస్) అనాధల పిల్లల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో ఉన్న ఆనందం మాటల్లో వివరించలేని భిన్నమైన అనుభూతిని కలిగి ఉంటుందని సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కడపలోని తన నివాసంలో అనాధ పిల్లలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులైన ప్రజలు ఎక్కువగా మురికివాడల ప్రాంతాలలో అందుబాటులో ఉన్న వస్తువులతో గుడిసెలు నిర్మించుకొని నివసిస్తున్నారని తెలిపారు. అలాంటి వారికి సరిగ్గా బట్టలు లేక చలికాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అలాంటి వారికి చిన్న చిన్న సహాయం అందించడానికి తాము ఎల్లప్పుడూ



సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అలాగే, నిస్సహాయ జీవితాన్ని గడుపుతున్న ప్రజలకు మేము దుప్పట్లు, బట్టలు పంపిణీ చేస్తామని, వారి జీవితాల్లో కొన్ని ఆశల ఛాయలు తీసుకురావడానికి వేము ప్రయత్నిస్తున్నామన్నారు. చలికాలంలో దుప్పట్లు, బట్టలతో పాటు, అన్నదానం, వండ్లు, స్వీట్లు పంపిణీ కార్యక్రమాలు, ఫేస్ మాస్కులు, శానిటైజర్‌లు మొదలైనవి తాము, తమ ప్రతినిధులు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే, మేము పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తు, గరిష్ట సంఖ్యలో ఆకలితో ఉన్నవారిని చేరుకోవడానికి ప్రయత్నిస్తున్నాము అని తెలిపారు. మీరు ఏదైనా వస్తువును విరాళంగా అందించాలని ఎదురు చూస్తున్నట్లయితే, దయచేసి ఎస్.జె.డబ్ల్యు.హెచ్.ఆర్.సి ప్రతినిధులకు సమాచారం ఇవ్వండి అని సూచించారు. చురుకుగా పనిచేస్తున్న మా వాలంటీర్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే మీ పాత వెచ్చని బట్టలు, దుప్పట్లు, ఇతర వస్తువులు ఎవరైనా వాటిని నిరాశ్రయులయులకు ఉపయోగంలో ఉంచగలరని, వారి ఆనందానికి కారణం కావచ్చు అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజే మకర సంక్రాంతి



సంక్రాంతి అనగా నూతన క్రాంతి . సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు.అయితే ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారు. అయితే మనకు పన్నెండు రాశులు ఉన్నాయి.ఆ పన్నెండు రాశులలోకి సూర్యుడు ప్రవేశించే క్రమంలో మనకు పన్నెండు సంక్రాంతులు వస్తాయి.సూర్య సంక్రమణం జరిగేటపుడు సూర్యుడు ఏ రాశిలో ఉంటే ఆ సంక్రాంతి అంటారు. ఇలా ప్రతి మాసం ఒక సంక్రాంతి ఉంటుంది.సౌరమాన కాలెండరులో ప్రతినెల ఒక సంక్రాంతితో ప్రారంభమవుతుంది ఈ పండుగను పెద్ద పండుగగా ఆంధ్రులు జరుపుకుంటారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాలగవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటి రోజు భోగిమంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గో పూజలతో అలాగే మాంసప్రియులకు మంచి కూరలతో, మూడురోజుల వండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుంది. ఉత్తరాయణం సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే కాలమే మకర సంక్రమణము. మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభము అవుతుంది. ఆ తరువాత కుంభ, మీన, మేష,వృషభ, మిథున రాశులలో కొనసాగినంత కాలము ఉత్తరాయణము. శారీరక పరిశ్రమకు, పూజలకు, సాధనలకు, కృషికి అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము ఉత్తరాయనము. కర్కాటక రాశిలోకి సూర్యుడు ప్రవేశించిన దగ్గరినుండి మొదలై, ఆ తరువాత సింహ, కన్య, తుల, వృశ్చికం, ధనూ రాశులలో కొనసాగినంత కాలము దక్షిణాయణము. మానసికమైనఅర్చనకు,ధ్యానానికీ,యోగానికీ,దీక్షలకు,బ్రహ్మచర్యానికి, నియమ నిష్టలకు అనువైన, ఆవశ్యకత ఉన్న కాలము దక్షిణాయణము. పన్నెండు నెలల సంవత్సర కాలములో ఆరు నెలల దక్షిణాయణము దేవతలకు ఒక రాత్రి, ఆరు నెలల ఉత్తరాయణము దేవతలకు ఒక పగలు. కనుక దేవతలు మేలుకునే కాలము ఉత్తరాయణ పుణ్య కాలము. కనుకనే ఉత్తరాయనము వరకూ ఎదురు చూసి ఉత్తరాయణము ప్రవేశించిన తర్వాత తనువును చాలించాడు మహానుభావుడైన భీష్ముడు."సంక్రాంతి" లేదా "సంక్రమణం" అంటే చేరుట అని అర్థం. జయసింహ కల్పద్రుమం అనే గ్రంథంలో "సంక్రాంతి"ని ఇలా విర్వచించారు - తత్ర మేషాదిషు ద్వాదశ రాశి క్రమణేషు సంచరతః సూర్యస్య పూర్వస్మాద్రాశే ఉత్తరః రాశౌ సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః - మేషం మొదలైన 12 రాశులలో సంచరించే సూర్యుడు ముందున్న రాశి నుండి తరువాతి రాశిలోనికి ప్రవేశించడమే సంక్రాంతి.సూర్యుని చలనంలో (రథయాత్రలో) ఘట్టాలు నాలుగు. అవి మేష, తుల, కటక, మకర సంక్రమణాలు. వీటిలో మకర సంక్రమణాన్ని "సంక్రాంతి పండుగ"గా వ్యవహరిస్తారు.మార్గశిరం పూర్తి కాగానే ఉత్తరాయణం మొదలవుతుంది. సూర్యుడి చుట్టూ భూమి పరిభ్రమించే మార్పు క్రమంలో తన చుట్టూ తాను కూడా తిరుగుతుంది.అందువలన సూర్యుడు ఆరు నెలలు ఉత్తరం వైపు ఆరు నెలలు దక్షిణం వైపు కనిపిస్తాడు.ఇలా ఉత్తరం వైపు కనిపించే క్రమమే ఉత్తరాయణం అంటారు.దక్షిణం వైపు కనిపించే క్రమం దక్షిణాయనం. మనకు ఒక సంవత్సరం కాలము అయితే దేవుళ్ళకు ఒక రోజు. అయితే ఒక రోజులో

## -అందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు

పగలు అనేది ఉత్తరాయణం. రాత్రి అనేది దక్షిణాయణం.. ఈ ఉత్తరాయణమనేది అందుకే మనకు అంత ముఖ్యం.. ఈ రోజు కోసమే భీష్ముడు ఎదురుచూసి ఉత్తరాయణ పుణ్య ఘడియలలోనే పరమపదించారు.మకర సంక్రాంతి : సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే రోజును మకర సంక్రాంతి అంటారు. ఇది ఆరు నెలలు ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభ దినం. సాంప్రదాయకంగా భారతదేశ కాలెండరు ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు జనవరి 14 లేదా జనవరి 15 వ తేదీలలో వస్తుంది.

మహా వైషువ సంక్రాంతి :

ఇవి రెండు ఋతువుల మధ్య వచ్చే సంధి కాలం. మొదటిది శీతాకాలం, వేసవి కాలం మధ్య వచ్చే సంధి కాల ప్రారంభం - మేష సంక్రాంతి (వసంతఋతువులో వచ్చేది), వేసవి కాలం, వర్షాకాలముల మధ్య వచ్చే సంధి కాలం - తుల సంక్రాంతి (శరత్ ఋతువులో వచ్చేది). సంవత్సరం మొత్తంలో ఈ రెండు రోజులు కచ్చితంగా పగలు రేయి సమానంగా ఉంటాయి.అంటే సూర్యోదయం, సూర్యాస్తమయాలు దాదాపు ఒకే సమయమున సంభవిస్తాయన్నమాట. ఈ సంక్రాంతి ఒరియా నూతన సంవత్సరం గానూ, బెంగాలీ కాలెండరులో ఆఖరి దినంగానూ నిర్వహిస్తారు. భారతదేశం లోని అనేక ప్రాంతాలలో ఈ రోజును వైశాఖిగా వ్యవహరిస్తారు.విష్ణు పది సంక్రాంతి : సింహ సంక్రాంతి, కుంభ సంక్రాంతి, వృషభ సంక్రాంతి, వృశ్చిక సంక్రాంతి.ధను సంక్రాంతి- చంద్రమాన కాలెండరులో పుష్యమాస మొదటి రోజు. దక్షిణాన భూటాన్, నేపాల్ లలో దీనిని వైల్డ్ దుంపలు (తరుల్) తినే పండగగా జరుపుతారు.కర్కాటక సంక్రాంతి : జూలై 16, న సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశిస్తుంది. ఈ దినాన్ని కర్కాటక సంక్రాతిగా వ్యవహరిస్తారు. ఈ దినం ఉత్తరాయణ పుణ్యకాలానికి ఆఖరి దినంగా హిందూ కాలెండరులో వ్యవహరిస్తారు. ఈ రోజు దక్షిణాయణ పుణ్యకాలానికి మొదటి రోజు.

# పవన్..వాస్తవాలు తెలుసుకో

## మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెంజనసేన అధినేత పవన్ కళ్యాణ్ రణస్థలంలో నిర్వహించిన యువశక్తి సభపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్పందించారు. పవన కళ్యాణ్ మాట్లాడిన మాటలు చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్ లాగి ఉంది. ఒకదానితో ఒకటి పొంతన లేదు. ప్రజారాజ్యం మూసేసినపుడు, జనసేన పెట్టినప్పుడు మాట్లాడిన మాటలకు ఈరోజు మాట్లాడే మాటలకు అసలు సంబంధం లేదు. స్వామి వివేకానంద సూచించిన 100మంది చాలు దేశాన్ని మారుస్తా అంటూనే, నీచంగా బూతులు బహిరంగ సభల్లో మాట్లాడుతున్నావని విమర్శించారు. సజ్జల సలహా వింటే నాశనం అంటున్నావు నీవు తీసుకుంటున్న నాదెల్ల సలహాలు తీసుకుంటూ నువ్వేం చేస్తున్నావ్. యువతను రౌడీలుగా, గుండాలుగా తయారవ్వమని చెప్తున్నావ్ కానీ చాదువుకోమని, మంచిగా ఉండడని మాత్రం చెప్తున్నవా?? నీ జేబులో నుండి చంద్రబాబు స్క్రిప్ట్ తీసి చదువుతున్నావా అని ప్రశ్నించారు. పెళ్లి బీజేపీ తో, కాపురం తెలుగుదేశం పార్టీతో చేస్తూ మూడు ముక్కలాట ఆడుతుంది నువ్వే. సభకు వచ్చిన వాళ్ళందరిని రెచ్చగొట్టి రౌడీల్లాగా మారుస్తావా. 2019 నుండి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి ఏంటో చూసావా. విద్యకు ప్రాధాన్యత వైఎస్ రాజశేఖరరెడ్డి పెద్దపీట వేసి ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా అందర్నీ చదివిస్తే నీ స్నేహితుడు చంద్రబాబు మొత్తం ఆపేశాడు. మళ్ళీ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు కాలేజీలకు పెట్టిన బకాయిలు కూడా చెల్లించి విద్యను అందిస్తున్నారు. ఆరోగ్య శ్రీ ని నామాటగా ఓటెయ్యమన్న తెలుగుదేశం ప్రభుత్వం నీరుగార్చేస్తే అప్పుడు నిద్ర పోయావా. తెలుగుదేశం పార్టీ ఆరోగ్య శ్రీకి పెట్టిన 800కోట్లు బకాయిలు తీర్చి, ప్రస్తుతం సమవర్ధవంతంగా నిర్వహిస్తుంది ఎవరో తెలీదా. వాడిని ఎవరికైనా చూపించాంద్రా బాబు అనే సినీమా డైలాగ్ నీకు సూట్ అవుతుంది. నీవు రెచ్చగొట్టే కార్యకర్తలు ఎక్కడ గొడవ పడినా వాళ్ళే ఉంటున్నారు. లా అండ్ ఆర్డర్ కి విఘాతం కలిగిస్తే ఏ పార్టీ వారైనా కేసులు పెడతారు. ఈరోజు వివేకానంద గురించి ఒక్క మాటైనా మాట్లాడవా. ఉత్తరాంధ్ర డెవలప్ మెంట్ కోసం ఉత్తరరంధ్రా డెవాలప్మెంట్ బోర్డు ఏర్పాటు చేస్తావా? చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్రలో ఒక్క ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేశారా? జగన్మోహన్ రెడ్డి 7 ఫిషింగ్ హార్బర్ లని నిర్మిస్తున్నారు. మిమ్మల్ని నమ్మితే మ్యూనిగిపోతావని నువ్వే చెప్తున్నావ్. ఈ సమాజం పట్ల నీకు ప్రేమ ఉంటే సినిమా డైలాగ్స్ మానేసి వాస్తవాలు తెలుసుకుంటే బాగుంటుందని అన్నారు. పార్టీ పరంగా, కులం పరంగా, ప్రాంతాల పరంగా ఎవరికి సంక్షేమ పథకాలు అందటం లేదో ఒక్కరిని చూపించు. సింగిల్ గా వెళ్లే దమ్ము లేదని తేల్చేశావ్. ప్రజల్ని తప్పుదారి పట్టించడం కోసం ఈ సభ ద్వారా ప్రయత్నం చేస్తున్నావా. సామాజిక వర్గాన్ని అడ్డ పెట్టుకుని ఆ సామాజిక వర్గన్నాయి పాడు చేసే విధంగా కృషి చేస్తున్నావ్. వివేకానంద జయంతి ఇచ్చే సందేశం యువతను యుద్ధాలు చేయాలని, జైళ్లకు వెళ్లాలని చెప్పాడమేనా నువ్విచ్చే సందేశం. నవరత్నాలు కంటే మెరుగ్గా చేస్తా అంటున్నావు. ఈ సంక్షేమ పథకాలు ఇస్తే అప్పుల పలు అవుతాదని చెప్పింది నువ్వేగా. ఎంత నీచానికి దిగజరిపోయి మాట్లాడుతున్నావ్. మూడు పెళ్లిళ్లు చేసుకోమని చెప్తున్నావ్ ఇదేనా ఈరోజు నువ్విచ్చే సందేశం. సినిమా డైలాగ్స్, చంద్రబాబు స్క్రిప్టు పట్టుకుని సభల్లో మాట్లాడితే ఇంకా పలుచ పడతావ్ తప్ప ఏమీ ఉపయోగం ఉండదు. మన చిత్తశుద్ధిని ప్రజలు నమ్మితేనే ప్రజలు మనల్ని గెలిపిస్తారు తప్ప సన్నాసులు, వేదవలు అంటూ మాట్లాడితే జనం చూసి భయపడతారు. ఈరోజు నువ్వు చేసిన ఒక్క ఆరోపణ కూడా నిజం లేదు. వాస్తవాలు తెలుసుకో, నువ్వు పాడు చేద్దామన్నా పాడు అవడానికి ప్రజలు సిద్ధంగా లేరని అయన అన్నారు.

# ఉయ్యూరులో కోడి పందెల కు సై..సై

పెనమలూరుసంక్రాంతి వస్తుండటంతో పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని ఉయ్యురు మండలంలో అప్పుడే కోడిపందేల జోరు మొదలైపోయింది. గండిగుంట, పెద్ద ఓగిరాల, మరి కొన్ని ఇతర గ్రామల్లో ఇష్టానురాజ్యంగా పందెం బరులను జూదం రాయుళ్లు రెడీ చేశారు. ఒకవైపు పోలీసులు చర్యలు తీసుకుంటున్నా, కోడిపందేలు, గుండాట, పేకాట మాత్రం జోరుగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంక్రాంతి కోసం నిర్వాహకులు ఇప్పటినుంచే పందేకోళ్లను రెడీ చేస్తున్నారు. పోలీసుల హెచ్చరికలు హెచ్చరికలుగానే మిగులుతాయా..?, రాజకీయ నేతలు కు తలోగ్గుతారా..?లేక నిజంగానే కంట్రోల్ చేయగలుగుతారా..? వేచి చూడాలి..

## టౌన్ ప్రజలకు పొగ వల్ల ఇబ్బందులు ఉండవు

--శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్యే



నంద్యాల :- నంద్యాల పట్టణంలో ఇక ప్రజలకు పొగ వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు డంపింగ్ యార్డ్ నందు 5కోట్ల 50లక్షల రూపాయల తో చెత్తను ఎరువుగా తయారుచేసే యంత్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక మీదట ఒకటో వార్డు ప్రజలు గాని అలాగే టౌన్ ప్రజలు గాని పొగ వలన ఇబ్బంది పడవలసిన అవసరం ఉండదని చెప్పుకొచ్చారు.ముఖ్యంగా నంద్యాల మీద ప్రత్యేక దృష్టిపెట్టిన జగన్మోహన్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి. వైస్ చైర్మన్ ఒకటో వార్డ్ ఇంచార్జ్ మునయ్య కన్నమ్మ ఎర్రన్న జనార్దన్ శేఖర్ బాబు అలాగే మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐకాన్ బ్రిడ్జి వద్దు బ్యారేజీ కం బ్రిడ్జి నిర్మించాలి




నంద్యాల :-మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో శుక్రవారం రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా మండలం రైతు నాయకులు నన్నపనేని పెద్ద బాబు, పోలిశెట్టి పుల్లయ్యలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో జరిగే చలో సిద్దేశ్వరం విజవంతం చేద్దాం అన్నారు. అదేవిధంగా రాయలసీమ కరువు, దారిద్ర్యం, వలసల నివారణ కోసమైనా కృష్ణానదిపై సిద్దేశ్వరం వద్ద బ్యారేజీ కం వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కృష్ణా- పెన్నార్ ప్రాజెక్ట పోగొట్టుకున్నామని అన్నారు.తెలుగుగంగ నుంచి 15 టీఎంసీ ల నీరు చెన్నైకి తరలిపోతున్నా చూస్తూ వుండే పరిస్థితి నెలకొందని, శ్రీశైలం గేట్లు తెరిస్తే రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందని పరిస్థితి ఉందని, శ్రీశైలం గేట్లు సగం తెలంగాణకు, మనకు సగం సగం చేశారన్నారు. శ్రీశైలం గతంలో విద్యుత్ ఉత్పాదన ప్రాజెక్టు నేడు ప్రాజెక్ట్ ఎలా ఉపయోగపడుతుందో అందరికి తెలిసిన విషయమేనన్నారు. నాగార్జునసాగర్ కు అటునుంచి కృష్ణా డెల్టాకు నీళ్లు వదిలిపెడుతున్నారు. ఏటా వందల టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నా మన నేతలు పట్టించుకోవడం లేదన్నారు.కేంద్రప్రభుత్వం సుమారు 11వందల కోట్లతో అటు తెలంగాణ నుంచి ఇటు ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం 167కే జాతీయ రహదారి పేరుతో తెలంగాణ నుంచి కృష్ణా నదిపై సోమశీల - సిద్దేశ్వరం మధ్య ఐ కానిక్ (తీగల ) బ్రిడ్జి నిర్మాణం చేపడుతుందని వివరించారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 28 న చలో సంగమేశ్వరం -సిద్దేశ్వరం ప్రజా ప్రదర్శనకు మహానంది మండలం నుండి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చలో సిద్దేశ్వరం కరపత్రాలు విడుదల చేసి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండలం నాయకులు తమ్మడపల్లె కాసు వెంకటేశ్వర్లు, బుక్కాపురం సాలెకమ్మ పుల్లారెడ్డి, పి. చలమయ్య, నంది శ్రీనివాస్, పులిమద్ది మౌలాలి, షేక్ ఖాసీం, వెంకటేశ్వర్లు, శ్రీనగరం రైతులు పాల్గొన్నారు.

## హౌసింగ్ పై సమీక్ష సమావేశం



తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు పత్తికొండ ఆర్డిఓ మోహన్ దాస్ అధ్యక్షతన శుక్రవారం రోజున హౌసింగ్ అధికారుల సమక్షంలో హౌసింగ్ పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఆర్డిఓ మోహన్ దాస్ హౌసింగ్ అధికారుల ద్వారా జగనన్న కాలనీలా పురోగతిని తెలుసుకున్నారు. జగనన్న కాలనీకు సంబంధించి అన్ని మౌలిక వసతులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని అధికారులకు తెలియజేశారు. అదేవిధంగా జగనన్న గృహ నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు బిల్లులలో ఎటువంటి జాప్యం జరగకూడదని ఆర్డిఓ అధికారులకు తెలియజేశారు. మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల యందు పురోగతి నెమ్మదిగా ఉన్న గ్రామాలలో అధికారులు పర్యటించి పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులకు ఆర్డీవో మోహన్ దాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవి,హౌసింగ్ ఏఈ విజయ్ కుమార్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు,హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ చేయాలంటే . ప్రజాభిప్రాయ సేకరణ తప్పని సరి

నంద్యాల :-నంద్యాల పట్టణంలో శుక్రవారం నాడు విలేకరుల సమావేశం లో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రియల్ హబ్ చేయాలంటే తప్పని సరిగా ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటారని ఆయన చెప్పారు. నంద్యాల జిల్లా చాబోలు గ్రామం వద్ద ఇండస్ట్రియల్ హబ్ వస్తుంది రైతుల పొలాలు తీసుకుంటున్నారు అని కొందరు ప్రతి పక్ష నాయకులు చేస్తున్న ప్రచారం తగదన్నారు. కూడా నామ్స్ ప్రకారం సంబంధిత అధికారులు అయ్యలూరు ప్రాంతం లో ఇటుకల బట్టిలు అలాగే విజయ డైరీ ఉండడం తో కూడా అధికారులు దాని వెనుక భాగం కూడా ఇండస్ట్రియల్ ఏరియా క్రింద వస్తుందని గ్రాఫ్ మాత్రమే ఇచ్చారన్నారు. దాని తరువాత ప్రజా అభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు. ఇందులో ప్రజలు వ్యతిరేకిస్తే అక్కడి నుండి వేరే ప్రాంతానికి తరలించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి జీవో రాలేదు అని దీనిపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. కావున అలాంటి ప్రచారం ప్రజలు నమ్మవద్దు అని అన్నారు.

## బద్వేల్ లో ఇప్పటికీ రాజ్యమేలుతున్న నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు



బద్వేలు . బద్వేల్ లో నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు ఇప్పటికీ రాజ్యమేలుతున్నాయి మొన్నటి వరకు నిశ్శబ్దంగా ఉన్న అక్రమార్కులు ఇప్పుడు చెలరేగిపోతున్నారు బద్వేల్ లో నకిలీ ఇంటి పట్టాలకు నకిలీ అనుబంధ పత్రాలకు అడ్డుకట్ట పడిందని అందరూ భావించారు కానీ అందుకు విరుద్ధంగా ఇప్పుడు జరుగుతుంది ఆర్డీవో గా ఆకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించిన తర్వాత నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలపై పూర్తిగా దృష్టి సారించి వాటిని కొంతవరకు అరికట్టగలిగారు ఇటువంటి వాటిని తయారు చేస్తున్న దాదాపు 26 మంది పై పోలీసులు కేసు నమోదు చేసి వారిలో కొంతమందిని అరెస్ట్ చేశారు మరి కొంతమంది బెయిల్ పై ఉన్నారు మైదుకూరు డిఎస్పి వంశీధర్ గౌడ్ బద్వేల్ అర్బన్ రూరల్

### వాటిని అడ్డుపెట్టుకొని నిర్మాణాలుఆర్డిఓ ఆకుల వెంకటరమణ నివాసముంటున్న ఇంటికి అతి సమీపంలోనే అక్రమ నిర్మాణాలుఅక్రమ నిర్మాణాల్లో అధికార పార్టీ పెద్దల పాత్ర

సిఐలు వెంకటేశ్వర్లు హనుమంతు నాయక్ ఎస్సైలు శ్రీకాంత్ కత్తి వెంకటరమణ చంద్రశేఖర్ ఈ విషయంలో కీలక పాత్ర పోషించారు ఇప్పటికీ వారి దృష్టి నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు తయారుచేసి వారి పైన భూములకబ్జాలు చేసే వారి పైన ఉంది తాజాగా బద్వేలు పట్టణంలో ఆర్డిఓ నివాసం ఉంటున్న ఇంటికి అతి సమీపంలో కబ్జాదారులు నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు అడ్డుపెట్టుకొని నిర్మాణ పనులు చేస్తున్నారు పూర్వపు చెన్నంపల్లి పంచాయతీసర్వే నంబర్ 1779/1 లో గత పది రోజులుగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం ఈ సర్వే నెంబర్లు బద్వేల్ రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి ఇంటి పట్టాలు అనుబంధ పత్రాలు ఇవ్వలేదు ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులే చెబుతున్నారు మండలంలో పనిచేస్తున్న కొంతమంది వీఆర్వోలు వీఆర్ఏలు పంచాయతీ కార్యదర్శులు నకిలీ ఇంటి పట్టాలు నకిలీ అనుబంధ పత్రాలు సృష్టించి కబ్జాదారులకు లక్షల రూపాయలకు విక్రయించినట్లు తెలిసింది బద్వేలు గోపవరం నాక్కూడా సంబంధం మండలాల్లో పనిచేస్తున్న కొందరు వీఆర్వోలు వీఆర్ఏలు ఈ విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నారు ఎలాంటి ఆరోపణలు వచ్చాయో ఇప్పుడు అంతకుమించి వస్తున్నాయి అన్ని అనుమతులతో ఎవరైనా ఆ పంచాయతీలో ఇంటి నిర్మాణాలు చేస్తుంటే అక్కడి వెళ్లి బెదిరించడం డబ్బులు గుంజడం ఆర్డిఓ ఎమ్మార్వో పేర్లు వారికి తోడుగా మరికొందరు ఉద్యోగులు ఉన్నట్టు సమాచారం వాటాలు పంచుకోవడంలో ఈ ముగ్గురు మధ్య తేడాలు రావడంతో గతంలో వీరు జుట్టు జుట్టు పట్టుకొని కొట్టుకున్నారు

## శ్రీ వినాయక స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీ

ఆత్మకూరు.., ( జనవరి 13 శుక్రవారం ).ఆత్మకూరు పట్టణంలోని నాలుగవ వార్డు జగన్నాధ రావు పేట (జె.ఆర్.పేట) నందు నూతనంగా నిర్మించిన శ్రీ వినాయక స్వామి మండపం దగ్గర జె ఆర్ పేట శ్రీ వినాయక స్వామి వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీలు భోగి




పండుగ రోజున (14/01 2023 ) శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించబడుతుందని ఆ కమిటీ సభ్యులు తెలిపారు. ముగ్గుల పోటీలు గెలిచిన మహిళలకు ప్రథమ బహుమతిగా 3,116/- లు రెండవ బహుమతిగా 2,116/- లు , మూడవ బహుమతిగా 1,516/- లు అదే రోజున ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఇవ్వబడుతుంది ముగ్గుల పోటీలు పాల్గొన్న దలచిన మహిళలు ఎవరి ముగ్గు వారే తెచ్చుకోగలరు. వివరాలకు 9440108484 , 9603018249 , 6281845587 నెంబర్లను సంప్రదించగలరు.

## బందిపోటు దొంగగా పవన్ కళ్యాణ్ ?



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ క్రిష్ కాంబోలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్న హరిహర వీరమల్లు సినిమాలోపవన్ కళ్యాణ్ ఒక బందిపోటు దొంగగా కనిపిస్తారని టాక్. ఇక ఈ సినిమా కథ 17వ శతాబ్దంఔరంగజేబు సామ్రాజ్యం నాటి నేపథ్యంతో వస్తుంది. సినిమాలో పవన్ ఇదివరకు ఎప్పుడూ చూడని విధంగా లుక్స్ యాక్షన్ తో కనిపిస్తారని తెలుస్తుంది. ఇక సినిమాలో పవన్ దొంగగా కోహినూర్ వజ్రాన్ని దొంగిలిస్తారట. ఔరంగజేబు సామ్రాజ్యంలో ఉన్న కోహినూర్ ను పథకం ప్రకారం వీరమల్లు తన సొంతం చేసుకుంటారట. ఈ సీన్స్ సినిమాలో చాలా స్పెషల్‌గా సినిమాకు హైలెట్ గా ఉంటాయని తెలుస్తుంది. క్రిష్ ఈ సినిమాను చాలా ఫోకస్ తో తెరకెక్కిస్తున్నారు. పవన్ కెరీర్ లో డిఫరెంట్ మూవీగా హరి హర వీరమల్లు సినిమా వస్తుందన్నచర్చ సాగుతోంది. సినిమా అంతా ప్రేక్షకులకు ఒక అద్భుతమైన అనుభూతి అందిస్తుందని అంటున్నారు. ప్రేక్షకులకు కావాల్సిన వినోదంతో పాటుగా 17వ శతాబ్దం నాటి కథను కూడా క్రిష్ ఈ సినిమాతో చెప్పబోతున్నారు. సినిమాలో హీరోయిన్స్‌గా నిధి అగర్వాల్, జాక్వెలిన్ నటిస్తున్నారు. బాలీవుడ్ హీరోయిన్ నోరా ఫతేహి కూడా ఈ సినిమాలో స్పెషల్ రోల్ లో నటిస్తుందని తెలుస్తుంది. పవన్ ఈ సినిమా మీద పూర్తి నమ్మకంతో ఉన్నాడని తెలుస్తుంది. నిర్మాత ఏ.ఎం రత్నం కూడా సినిమాను ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఖర్చు పెడుతున్నారు. పవన్ హరి హర వీరమల్లు సినిమా పాన్ ఇండియా మూవీగా వస్తుంది. సినిమా తప్పకుండా ప్రేక్షకుల అంచనాలకు తగినట్టుగానే ఉంటుందని చెప్పొచ్చు. సినిమాలో ఔరంగజేబు పాత్రలో బాలీవుడ్ స్టార్ బాబీ డియోల్ నటిస్తున్నారు.




## ఆస్కార్ అర్హతా చిత్రాల్లో కాంతారా




గతేడాది పలు సౌతిండియా సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో అలరించిన విషయం తెలిసిందే. అందులో.. 'ఆర్ఆర్ఆర్', 'కేజీయఫ్ ఛాప్టర్ 2', 'కాంతారా' తో పాటు పలు చిత్రాలు ఉన్నాయి. వీటిలో 'కాంతారా' అయితే ఎటువంటి అంచనాలు లేకుండా వచ్చి సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది. హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రంలో రిషబ్ శెట్టి హీరోగా నటించడంతోపాటు దర్శకత్వం వహించాడు. కేవలం రూ.16 కోట్ల బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.400 కోట్ల వసూళ్లు సాధించింది.

కర్ణాటకలోని మంగుళూరుకి చెందిన 'భూతకోల' ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి దేశవ్యాప్తంగా సినీ ప్రేక్షకులు కనెక్ట్ అయిపోయారు. ముఖ్యంగా సినిమా చివరి 20 నిమిషాల్లో రిషబ్ శెట్టి నటనకి ముగ్ధులయి పోయారనే చెప్పాలి. దీంతో ఎటువంటి ప్రచారం లేకుండా కేవలం మౌత్ టాక్‌తోనే మంచి విజయాన్ని సాధించింది. తాజాగా ఈ సినిమా మరో ఘనత సాధించింది. అది కూడా చాలా సైలెంట్‌గా. 'ఆస్కార్' అవార్డులకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ తెలిసిందే. ప్రతి మూవీ టెక్నీషియన్ ఒక్కసారైనా ఆ అవార్డుని అందుకోవాలని ఉవ్విళ్లూరుతారు. 'ఆస్కార్ 2023'కి 'కాంతారా' సినిమా రెండు విభాగాల్లో కంటెస్టెషన్ లిస్ట్‌లో చోటు సాధించింది. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో టాప్ 15 జాబితాలో ఈ చిత్రం నిలిచింది. టాప్ 5లో నిలుస్తుందో లేదో చూడాలి. ఈ విషయాన్ని తెలుపుతూ.. 'కాంతారా' నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సోషల్ మీడియాలో ఓ ట్వీట్ చేసింది. అందులో.. 'కాంతారా'కి 2 ఆస్కార్ అర్హతలు లభించినందుకు ఆనందంగా ఉంది! మాకు మద్దతుగా నిలిచిన వారందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు. మీ అందరి మద్దతుతో ఈ ప్రయాణాన్ని పంచుకోవడం సంతోషంగా ఉంది. ఆస్కార్‌లో మెరవడానికి ఎదురుచూస్తున్నాం' అని రాసుకొచ్చింది. కాగా.. ఇప్పటి వరకూ గుజరాతీ చిత్రం 'ది ఛెల్లో షో', టాలీవుడ్ చిత్రం 'ఆర్ఆర్ఆర్' మాత్రమే ఆస్కార్ బరిలో ఉన్నాయని అందరూ అనుకున్నారు. సడెన్‌గా ఈ లిస్ట్‌లో 'కాంతారా' చేరడం విశేషం.

## గడ్డు పరిస్థితులు.. రాహుల్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఏమీ ఆడలేదు!



భారత మాజీ బ్యాటర్ ''గత కొంతకాలంగా అతడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాడు. ముఖ్యంగా బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లోపేలవ ప్రదర్శనతో విమర్శలపాలయ్యాడు. అంతేకాదు.. వైస్ కెప్టెన్‌గా తనకిప్పుడు హోదా లేదు. గత మూడు, నాలుగు నెలల కాలంగా పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. అయితే, ఇప్పుడు మాత్రం ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి తన సత్తా చాటాడు. సరైన సమయంలో తనను తాను నిరూపించుకున్నాడు" అంటూ టీమిండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్.. కేఎల్ రాహుల్‌ను ప్రశంసించాడు. శ్రీలంకతోరెండో వన్డేలో భారత్ విజయంలో రాహుల్ కీలక పాత్రపోషించిన విషయం తెలిసిందే.

కీలక సమయంలో సత్తా చాటి..కోల్‌కతాలో జరిగిన గురువారం నాటి మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న లంకను భారత బౌలర్లు దెబ్బకొట్టారు. కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్ మూడేసి వికెట్లు తీయడంతో.. 215 పరుగులకే పర్యాటక జట్టు కథ ముగిసింది. అయితే, లక్ష్యం చిన్నదే అయినా.. టీమిండియా టాపార్డర్ విఫలం కావడం తీవ్ర ప్రభావం చూపింది. ఈ క్రమంలో ఐదో స్థానంలో బ్యాటింగ్ చేసిన వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ 103 బంతులు ఎదుర్కొని 64 పరుగులతో ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. జట్టును గెలుపు తీరాలకు చేర్చాడు. కాగా గత కొన్నాళ్లుగా నిలకడలేమి ఫామ్‌తో సతమతమవుతున్న రాహుల్ కీలక సమయంలో రాణించి తన విలువేమిటో చాటుకున్నాడు. ఈ నేపథ్యంలో స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడుతూ మాజీ బ్యాటర్ మహ్మద్ కైఫ్ ఈ కర్ణాటక ప్లేయర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గొప్పగా ఏమీ లేకపోవచ్చు!"జట్టు కష్టాల్లో ఉన్న వేళ ఆచితూచి ఆడాడు. పరిస్థితులకు తగ్గట్లుగా బ్యాటింగ్ చేశాడు. గత మ్యాచ్‌లో తన స్ట్రైక్ రేటు(134.48) బాగానే ఉంది. అప్పటికి ఇంకా వికెట్లు చేతిలో ఉన్నాయి. కానీ రెండో వన్డేలో పరిస్థితి వేరు. ఇక్కడ తన బ్యాటింగ్ తన అనుభవానికి అద్దం పట్టింది. తన ఇన్నింగ్స్ గొప్పగా ఏమీ లేకపోవచ్చు. అయితే, కేఎల్ రాహుల్ ఇప్పుడు పరిణతి చెందిన బ్యాటర్ అంటే ఎలా ఉండాలో చూపించాడు" అని కైఫ్ కొనియాడాడు. చేజారిన వైస్ కెప్టెన్సీమొదటి వన్డేలో రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి విశ్వరూపం ప్రదర్శించిన వేళ.. రాహుల్ 29 బంతుల్లో 39 పరుగులు చేసి అవుటయ్యాడు. ఇక బంగ్లా పర్యటన తర్వాత స్వదేశంలో లంకతో టీమిండియా టీ20 సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్ పాండ్యా.. వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ డిప్యూటీగా ఉన్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190